ఆధ్యాత్మిక అమృతవాహిని

# శ్రీ రామకృష్ణ ప్రభ

జూలై 2009
వెల : రూ. 10



విజయుని విజయ రహస్యం 'ఏకాగ్రత'

# సుబోధ

స్వాతి నక్షత్రం నింగిలో ఉన్నప్పుడు పడే వాన చినుకును గ్రహించడానికి ముత్యపుచేప సముద్రం అడుగు నుంచి  ఉపరితలానికి వస్తుంది. అది తన చిప్పలను తెరచుకొని ప్రశస్తమైన స్వాతి వాన చినుకు పట్టుబడేవరకూ నీళ్ళ మీద తేలుతుంటుంది. చినుకు పట్టుబడగానే సముద్రపు అడుగున తన నివాసానికి వెళ్ళి, ఆ చినుకును చక్కని మంచి ముత్యంగా మారేవరకూ స్థిమితంగా అక్కడే ఉంటుంది. అలాగే తారక మంత్రోపదేశం చేసే సద్గురువు లభించడానికి ఒక చోటు నుంచి మరో చోటుకు సంచారం చేసే ముముక్షువులు కొందరు ఉంటారు. అలాంటి సద్గురువును చూసే భాగ్యం కలిగి, అతడి వల్ల తారక మంత్రోపదేశాన్ని పొందగానే, వారు (ముముక్షువులు) సమస్త సంగాలనూ వీడి, హృదయగుహాంతరాళంలో ప్రవేశించి, బ్రహ్మానందప్రాప్తి పర్యంతం (మంత్ర జపం చేస్తూ) అందులోనే నెలకొని ఉంటారు.

బ్రహ్మవేత్త అయిన సద్గురువుకి శాస్త్రపాండిత్యం లేకపోయినంత మాత్రాన నిరాశ చెందనవసరం లేదు. పుస్తకాల్లోని జ్ఞానాన్నంతటినీ మించిన దివ్యజ్ఞానం, సాక్షాత్కార రూపమైన తత్త్వజ్ఞాన సంపదగల  సద్గురువు నుంచి పొందిన మంత్రాన్ని జపిస్తే బ్రహ్మానంద ప్రాప్తి తప్పక కలుగుతుంది. ❖

('శ్రీరామకృష్ణ బోధామృతం' నుంచి)

**శ్రీరామకృష్ణ ప్రభ**
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్ - 500 029
ఫోన్: 040-2766 7799, 2763 3936
E-mail : sriramakrishnaprabha@gmail.com

నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద
సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

# సురభి

భక్తురాలు (క్షీరోద్ బాల) : అమ్మా! నా మనస్సు కుటుంబ వ్యవహారాల వైపు కించిత్తు కూడా పోవడం లేదు. నన్ను లౌకిక వ్యక్తుల మధ్య వదలిపెట్టకండి. ఇదే నా ప్రార్థన.

మాతృదేవి: 'అమ్మాయీ! కుటుంబ జీవితం నిన్ను ఏం చేయగలదు? కుటుంబ జీవితం భగవంతుని కన్నా వేరైనదా ఏమిటి? భగవంతుడు సర్వత్రా ఉన్నాడు. ఆయన ఎక్కడ ఎలా ఏ స్థితిలో ఉంచుతాడో అక్కడే సంతృప్తితో నివసించు. ఆయనను శరణుజొచ్చి నువ్వు జీవించగలిగితే దేనికీ భయపడాల్సిన అగత్యం ఉండదు.

మరొక విషయం! గురుశిష్యులు కలిసి జీవించడం మంచిది కాదు. ఎందుకంటే గురువు దైనందిన జీవితాన్ని పరిశీలించే శిష్యుడు ఆయనను సామాన్య వ్యక్తిలా ఎంచడం కద్దు. ఇది శిష్యునికి చేటవుతుంది. గురువు ఇంటికి సమీపంలో విడిగా శిష్యుడు వసించి, రోజుకొకసారి వచ్చి ఆయనను దర్శించుకొని, ఆయన సాంగత్యంలో ఆనందిస్తూ ఉపదేశాలు స్వీకరించడం మంచిది. అలా శిష్యుడు అప్పుడప్పుడు గురువును కలుసుకోని పక్షంలో ఆయన బోధించింది మరచిపోవచ్చు. రోజూ ఇక్కడకు వస్తూ ఉండు'.

మాతృదేవి చేసిన ఈ ఉపదేశం నా శేషజీవితానికి స్పష్టమైన జీవన విధానాన్ని నిర్దేశించింది. ❖

('క్షీరోద్‌బాలా రాయ్' స్మృతులు)



With Best Compliments From
**CHAIRMAN & MANAGING DIRECTOR**
**THE KCP LIMITED**
KCP కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు.

ఆధ్యాత్మిక అమృతవాహిని

# శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 66 సంచిక: 7 జూలై 2009

వ్యాసం వసిష్ఠనప్తారం శక్తేః పౌత్రమకల్మషం ।
పరాశరాత్మజం వన్దే శుకతాతం తపోనిధిమ్ ॥

కృష్ణద్వైపాయనం వ్యాసం సర్వలోక హితేరతం ।
వేదాబ్జభాస్కరం వన్దే శమాది నిలయం మునిమ్ ॥

వసిష్ఠుని మునిమనుమడూ, శక్తి మహర్షి మనుమడూ, పరాశరుని పుత్రుడూ, శుక మహర్షి తండ్రీ అయిన తపోనిధి వ్యాసునికి వందనం.

సర్వలోక హితాన్ని కోరేవాడూ, వేదాలనే కమలాలను వికసింపజేసిన సూర్యుడూ, అంతరింద్రియ బహిరింద్రియాది శుభగుణాలకు నిలయమైనవాడూ అయిన కృష్ణద్వైపాయనుడనే వ్యాసమునికి వందనం.

## లోపలి పేజీల్లో...

4
సంపాదకీయం
విద్యార్థి చేయాల్సిన తపస్సు

12
మనస్సును జయించడానికి మందు!

6
గోరుముద్ద
ప్రాథమిక సూత్రాలు

13
ధీరవాణి
ప్రోత్సాహంతో పురోభివృద్ధి!

7
మనసుంటే మన వెంటే దేవుడు

14
పరిప్రశ్న

9
పరమేశ్వరుని పరిరక్షణలో...
దయగల దేవుడు ద్వారకానాథుడు

15
ఆచారవ్యవహారాలు-అంతరార్థాలు
పాంచజన్య ప్రార్థన

10
దేవీ వైభవం

16
బొమ్మల కథ
విశాల హృదయుడు హరగోవిందుడు



# శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి



ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'లో సభ్యులుగా చేరి ధనదానం చేయాల్సిందిగా మనవి. సభ్యుల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

| | | |
|---|---|---|
| **మహారాజ పోషకులు......** | రూ. | 10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు. |
| **రాజ పోషకులు............** | రూ. | 5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు. |
| **పోషకులు.................** | రూ. | 1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు. |

| దాత పేరు | చిరునామా | రూ. |
|---|---|---|
| పోషకులు : జయా నాయక్, | విద్యుత్‌నగర్, అనంతపురం (కీ॥శే॥ శ్రీ ఎస్. గాంగే నాయక్ జ్ఞాపకార్థం) | 2,000 |

## 'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

ప్రియ భక్తులారా!

యువతరంలో ఆత్మవిశ్వాసాన్ని నింపే యువనాయక స్వామి వివేకానంద స్ఫూర్తివచనాలతో వెలువడుతున్న 'శ్రీరామకృష్ణ ప్రభ'ను రాష్ట్రంలోని వివిధ పాఠశాలలకూ, కళాశాలలకూ అందించాలని సంకల్పించాం.

శ్రీరామకృష్ణుల, స్వామి వివేకానందుల సందేశాల ఆవశ్యకతను గురించి సుభాష్ చంద్రబోస్ ఒక సందర్భంలో చెబుతూ, "శీలనిర్మాణానికి రామకృష్ణ - వివేకానంద సాహిత్యం కన్నా ఉన్నతమైన సాహిత్యం వేరొకటి లేదు" అని అన్నారు.

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయడానికి మీ ఆర్థిక సహాయాన్ని కోరుతున్నాం. ఈ పథకం కింద రూ. 1500 మొత్తాన్ని జీవిత చందా (20 సంవత్సరాలకు) కట్టినట్లయితే మీరు సూచించిన, లేదా మేము ఎంపిక చేసిన ఒక పాఠశాల/కళాశాలకు 20 ఏళ్ళ పాటు పత్రికను మీ పేరున పంపుతాం. చందాదారుని పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

మీ చందాను ఎమ్.ఓ./డి.డి./చెక్కు రూపంలో Ramakrishna Math, Hyderabad పేరున తీసుకొని, Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029 చిరునామాకు పంపవలెను.

స్వామీజీ ఆదర్శాలకు అనుగుణంగా యువతరాన్ని తీర్చిదిద్దడంలో 'శ్రీరామకృష్ణ ప్రభ' చేపట్టిన ఈ పథకానికి చేయూతనందించగలరని ఆశిస్తున్నాం. భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ప్రార్థిస్తూ...

భగవత్సేవలో

స్వామి జ్ఞానదానంద

అధ్యక్షులు

శ్రీ వై. కృష్ణా రెడ్డి, పాలకల్, చిత్తూరు జిల్లా - 50 పాఠశాలలకు (మూడు సంవత్సరాలకు) 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను స్పాన్సర్ చేశారు.

స్ఫూర్తి వలెంటరీ ఆర్గనైజేషన్, అనంతపురం - 219 కారాగారాలకు (ఒక సంవత్సరానికి) 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను స్పాన్సర్ చేశారు.

**ముఖచిత్రం :** విలు విద్యలో శిక్షణనిస్తూ అర్జునుడి ఏకాగ్రతను పరీక్షిస్తున్న గురువు ద్రోణాచార్యుడు.


## ADVERTISEMENT TARIFF

| | MULTI COLOUR | B & W |
|---|---|---|
| Fourth Cover | Rs.25,000 | - |
| Second Cover | Rs.20,000 | - |
| Third Cover | Rs.20,000 | - |
| Inside Full Page | Rs.15,000 | 10,000 |
| Inside Half Page | Rs.10,000 | 5,000 |


| చందా వివరాలు | | ఇండియాలో | విదేశాలలో |
|---|---|---|---|
| విడి ప్రతి | : | రూ. 10 | - |
| ఒక సంవత్సర చందా | : | రూ. 100 | $ 25 |
| మూడు సంవత్సరాలకు | : | రూ. 280 | $ 55 |
| ఐదు సంవత్సరాలకు | : | రూ. 450 | $ 85 |
| ఇరవై సంవత్సరాలకు | : | రూ. 1500 | $ 365 |

గమనిక : డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.
పంపవలసిన చిరునామా : Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

# లోపలి పేజీల్లో...


18 ఆదర్శ గురువు శ్రీ శారదాదేవి



20 ఓ మహాత్యాగి ఆత్మకథ
(స్వామి వివేకానంద స్వీయ వచనాల సమాహారం)

22 అణకువతో సాధించిన 'ఆత్మజ్ఞానం'

25 ప్రాచీన గాథలు : జీవన వికాసం
గమనాన్ని సుగమనం చేసే గరుడ పురాణం

26 యువవాణి
నవతరం సందేహాలకు సమాధానాలు

27 మంచి మాటలు...
ముత్యాల మూటలు...



28 మనసు-మర్మం
మనోనియంత్రణకు భగవత్ చింతన!

29 ముందుకు సాగిపో!

31 మహనీయుల జీవితాల్లో మధురఘట్టాలు
బోధకులకు ఉద్బోధ!

33 ఈనాటి తపస్సు

34 నా జీవితంలో స్వామి వివేకానంద
నవతరానికి నవీన సందేశం



35 కనువిప్పు కలిగించిన కృష్ణుడు!


## శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

*ప్రియ పాఠకులారా!*

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు పైన చిరునామాకి కుడి భాగంలో మీ చందా గడువు నెల పొందుపరచబడి ఉంది. సకాలంలో సొమ్ము చెల్లించి, చందా పొడిగించుకొని, 'శ్రీరామకృష్ణ ప్రభ' ఆధ్యాత్మిక వెలుగులు మీ ఇంట నిరంతరాయంగా ప్రసరించేలా సహకరించండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నెంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారితే వెంటనే మాకు తెలియపరచి, సహకరించ మనవి.
- పత్రిక ప్రతీ నెల 26వ తేదీన పోస్ట్ చేయబడుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపు చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ....

- సర్క్యులేషన్ మేనేజర్

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకుడు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు.

- సంపాదకులు


SRI RAMAKRISHNA PRABHA, RAMAKRISHNA MATH
Domalguda, Hyderabad - 500 029. Andhra Pradesh
Phone No: 040 - 2766 7799, E-mail : sriramakrishnaprabha@gmail.com

# విద్యార్థి చేయాల్సిన తపస్సు

యోగులూ, సాధువులూ, భక్తులూ భగవత్సాక్షాత్కారం కోసం చేసే ప్రయత్నమే 'తపస్సు' అని సాధారణంగా అందరూ చెప్పే అర్థం. కానీ ప్రతి ఒక్కరూ తమ తమ రంగాలలో అభివృద్ధిని సాధించడానికీ, బాధ్యతలను సవ్యంగా నిర్వర్తించడానికీ చేసే కృషిని కూడా 'తపస్సు' అని చెప్పవచ్చు. తపస్సు అంటే మనసును నియంత్రించి, చేపట్టిన కార్యంలో సంపూర్ణ ఏకాగ్రతను కలిగి ఉండడమే అని శాస్త్రాలు చెబుతున్నాయి. కాబట్టి ఏకాగ్రతను సాధించడానికి మనం చేయాల్సిన ప్రయత్నమే తపస్సు.

**విద్యకు నూతన నిర్వచనం:** విద్యార్థికి ఏది తపస్సు? 'విద్యార్థులకు చదువే తపస్సు'. విద్యార్థులు చదువనే తపస్సు ద్వారా సాధించవలసింది ఏమిటి? 'ఏకాగ్రత'.

"విద్య అంటే సమాచార సేకరణ మాత్రమే కాదు. ఏకాగ్రతను సాధించడమే విద్య యొక్క సారాంశం. మనస్సుపై సంపూర్ణ సాధికారతను సాధించేందుకు సహకరించేదే నిజమైన విద్య" అంటారు స్వామి వివేకానంద.

మనిషికీ మనిషికీ మధ్య భేదానికి కారణం వారిలో గల ఏకాగ్రతా శక్తిలోని తేడాయే. అందువల్ల విద్యార్థులు విషయ సేకరణ కన్నా ముందుగా ఏకాగ్రతను అలవరచుకోవడానికి ప్రయత్నించాలి. విద్యకు స్వామి వివేకానంద ఇచ్చిన నూతన నిర్వచనం ఇదే.

**నైపుణ్యతకు నిదర్శనం ఏకాగ్రచిత్తం:** సాధారణంగా మన ఆలోచనా శక్తిలో తొంభై శాతాన్ని వృథా చేయడం వల్ల అనుకున్న పనిలో ఆశించిన ఫలితాన్ని పొందలేకపోతున్నాం. ఎవరైతే తమ ఆలోచనలన్నింటినీ ఒకే విషయంపై కేంద్రీకరిస్తారో, వారే చేసే పనిలో అత్యంత నైపుణ్యాన్ని ప్రదర్శించగలరు. అతి తక్కువ సమయంలో అనూహ్యమైన ఫలితాలను పొందగలరు.

"నేను మళ్ళీ విద్యాభ్యాసం చేయాల్సి వస్తే విషయ సేకరణ కోసం సమయాన్ని వెచ్చించను. ముందుగా ఏకాగ్రతను పెంపొందించుకొని అప్పుడు అధ్యయనం చేస్తాను" అని స్వామి వివేకానంద ఏకాగ్రత ప్రాధాన్యాన్ని గురించి తెలిపారు. కాబట్టి విద్యార్థులు పుస్తక పఠనం కన్నా ముందుగా ఏకాగ్రతను అలవరచుకోవడానికి ప్రయత్నించాలి.

కురు పాండు పుత్రులకు ద్రోణాచార్యుడు విలువిద్యలో సమానంగా శిక్షణనిచ్చాడు. విలువిద్యలో శిష్యుల ప్రావీణ్యాన్ని పరీక్షించాలనుకొన్నాడు ద్రోణాచార్యుడు. ఒక పక్షి బొమ్మను తయారుచేసి, చెట్టు చిటారు కొమ్మకు వేలాడదీశాడు. ముందుగా ధర్మరాజును పిలిచి చెట్టు కొమ్మనగల పక్షిబొమ్మను చూపించి "ఆ పక్షితోపాటు ఇంకా నీకు ఏం కనిపిస్తున్నాయి" అని ప్రశ్నించాడు. ధర్మరాజు "గురుదేవా! చెట్టు, చెట్టు కొమ్మలు, పక్షి కనిపిస్తున్నాయి" అన్నాడు. ద్రోణాచార్యుడు మిగతా శిష్యులందరికీ అదే ప్రశ్న వేశాడు. కొందరు చెట్టు కనిపిస్తున్నదనీ, మరికొందరు కొమ్మలు కనిపిస్తున్నాయనీ, మరికొందరు పక్షి కనిపిస్తున్నదనీ... ఇలా వేరు వేరు సమాధానాలు చెప్పారు. చివరిగా అర్జునుణ్ణి ప్రశ్నించగా అందుకు అర్జునుడు "ఆచార్యా! నాకు పక్షి తప్ప మరేదీ కనిపించడం లేదు" అన్నాడు. ఆ పక్షి ఏ రంగులో ఉంది అని ద్రోణుడు మరలా అర్జునుణ్ణి ప్రశ్నించాడు. "ఇప్పుడు నాకు పక్షి కన్ను తప్ప వేరేమీ కనిపించడం లేదు" అని అర్జునుడు బదులిచ్చాడు. అర్జునుడి సమాధానం విన్న ద్రోణుడు వెంటనే "బాణం సంధించు" అని ఆజ్ఞాపించాడు. అప్పుడు అర్జునుడు బాణం వదిలిపెట్టగానే పక్షి కన్నుకు తగిలింది. అర్జునుడి అసమానమైన ఏకాగ్రతకు ద్రోణుడు ఆనందించి, ఆలింగనం చేసుకున్నాడు.

స్వామి వివేకానందకు బాల్యం నుంచీ అసాధారణమైన జ్ఞాపకశక్తి ఉండేది. పాఠశాలలో ఉపాధ్యాయుడు చెప్పిన పాఠాల్ని నరేంద్రుడు (వివేకానందుని బాల్యనామం) కళ్ళు మూసుకుని ఏకాగ్రతతో వినేవాడు. ఒకరోజు నరేంద్రుడు నిద్ర పోతున్నాడనుకొని ఉపాధ్యాయుడు అతణ్ణి మందలించి, అప్పటి వరకూ బోధించిన పాఠం నుంచి ప్రశ్నలడిగాడు. నరేంద్రుడు ఉపాధ్యాయుడు అడిగిన ప్రశ్నలన్నింటికీ సరైన సమాధానం చెప్పడంతో నరేంద్రుని అపార జ్ఞాపకశక్తికి ఉపాధ్యాయుడు దిగ్భ్రాంతుడయ్యాడు.

వివేకానందుని జ్ఞాపకశక్తిని తెలియచేసే ఎన్నో సంఘటనలు ఆయన జీవితంలో చోటుచేసుకున్నాయి. ఆయన జ్ఞాపకశక్తికి ఆశ్చర్యపడిన ఉపాధ్యాయులూ, అధ్యాపకులూ, దేశ విదేశాల్లో అనేక మంది మేధావులూ 'మీ జ్ఞాపక శక్తి వెనుక రహస్యం ఏమిటి' అని అడిగేవారు. అందుకు బదులుగా స్వామీజీ 'ఏకాగ్రతే అసలు రహస్యం' అని సమాధానమిచ్చేవారు. చేసే పనిలో

మనసును సంపూర్ణంగా కేంద్రీకరించగలిగితే ఈ సామర్థ్యాన్ని ఎవరైనా పొందవచ్చని చెప్పేవారు స్వామీజీ.

**ఆకర్షణల మధ్య ఏకాగ్రత సాధ్యమా?** మనస్సును కల్లోలపరిచే సాంకేతిక పరికరాలు- టీ.వీ.లు, సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, పామ్‌టాప్‌లు ఆ కాలంలో లేవు కాబట్టి అర్జునుడికీ, నరేంద్రుడికీ ఏకాగ్రత సాధ్యమైంది. మరి నేడు ఏకాగ్రతను భంగపరిచే ఎన్నో ఆకర్షణలు, ప్రలోభాల మధ్య పెరుగుతున్న మా లాంటి విద్యార్థులకు ఏకాగ్రత ఎలా సాధ్యం! అనే సందేహం నేటి విద్యార్థుల్లో కలుగక మానదు.

ఈనాడు విద్యార్థుల ఏకాగ్రతకు సాంకేతిక పరికరాలు పరోక్షంగా భంగం కలిగిస్తున్నాయి. కానీ ఆనాడు అర్జునుడూ, నరేంద్రుడూ ప్రలోభాల్ని ప్రత్యక్షంగా ఎదుర్కోవలసి వచ్చింది.

దేవతల అనుగ్రహంతో దివ్య అస్త్రాలను సంపాదించడానికి అర్జునుడు హిమాలయ పర్వత ప్రాంతాలకు వెళ్ళి తపస్సు చేయాలనుకున్నాడు. అస్త్రాల కోసం అరణ్యాలలో తపస్సు చేస్తున్న తన కుమారుని దగ్గరకు ఇంద్రుడు వెళ్ళి 'కుమారా! అస్త్రాల వల్ల ఏం ప్రయోజనం? నీకు భోగభాగ్యాలనూ, ఉత్తమ లోకాలనూ ప్రసాదిస్తాను' అన్నాడు. అందుకు అర్జునుడు 'దేవేంద్రా! నాకు భోగభాగ్యాలు వద్దు. అరణ్యంలో కష్టాలను అనుభవిస్తున్న నా అన్నదమ్ములను రక్షించడమే నా కర్తవ్యం. నాకు ఇప్పుడు కావలసిందల్లా దివ్యాస్త్రాలే' అని ఇంద్రుడితో కచ్చితంగా చెప్పాడు. సాక్షాత్తూ దేవేంద్రుడే వచ్చి భోగభాగ్యాలను ప్రసాదిస్తానని చెప్పినా అర్జునుడు ప్రలోభపడలేదు.

నరేంద్రుడు విద్యార్థిగా ఉన్న రోజుల్లో ఎంతోమంది స్నేహితులు అతని ఏకాగ్రతను భగ్నం చేయడానికి ఎన్నో రకాల ఆకర్షణలనూ, ఆశలనూ చూపించారు. మరెన్నో విధాలుగా ప్రయత్నించారు. కానీ విద్యార్థికి విద్యార్జనే కర్తవ్యమని గుర్తించిన నరేంద్రుడు ఆ ఆకర్షణలకు లోబడలేదు.

దివ్యాస్త్రాల్ని సంపాదించి తన అన్నదమ్ములను రక్షించాలనుకున్న అర్జునుడికీ, విద్యార్థిగా చదువే తన కర్తవ్యం అని తలచిన నరేంద్రుడికీ ఆకర్షణలు ఎదురవక తప్పలేదు.

Whatever you do, devote your whole mind, heart, and soul to it... ***- Swami Vivekananda***

అనుకున్న కార్యాన్ని సాధించడానికి మనస్సు, బుద్ధి, చిత్తాలను సంపూర్ణంగా నిమగ్నం చేయగలిగిన నాడు ఎలాంటి ప్రలోభాలైనా మన చిత్త ఏకాగ్రతను సడలించలేవు.

**సాంత్వననిచ్చే నిజమైన స్నేహితులు :** ఆధునిక పరికరాల వినియోగంలో తాత్కాలిక ఆనందాన్ని పొందుతున్న విద్యార్థులు జీవితాంతం అండదండగా ఉండే మంచి మిత్రుల సాంగత్యాన్ని అలవరచుకోవడం ఎంతైనా అవసరం. మరి ఆ మంచి మిత్రులు ఎవరు?

జార్జ్ బెర్నార్డ్ షా విద్యార్థిగా ఉన్న రోజుల్లో ఆటపాటలు, స్నేహితులతో షికార్లు, జల్సాలతో ఎక్కువ సమయాన్ని గడిపేవాడు. ఇదంతా గమనించిన అతని తండ్రి ఒకరోజు షాతో 'నువ్వు స్నేహితులతో ఇలా షికార్లు తిరగడానికి నేను అభ్యంతరం తెలపడం లేదు. కానీ జీవితాంతం నీతోనే ఉంటూ, నిన్ను సన్మార్గంలో నడిపించే మంచి మిత్రులతో సాంగత్యం ఏర్పరచుకో. ఆ మంచి మిత్రులు ఎవరంటే... మంచి పుస్తకాలే!' అని అన్నాడు. తండ్రి సలహాను పాటించిన షా మంచి పుస్తకాలను నిత్యం చదవడం అలవాటు చేసుకున్నాడు. తరువాతి కాలంలో అతడు ఆదర్శ వ్యక్తిగా, ప్రఖ్యాత రచయితగా పేరు గాంచాడు.

విద్యార్థులు ఏకాగ్రచిత్తంతో విద్యార్జన చేయాలంటే ప్రతీ క్షణాన్నీ సద్వినియోగపరచుకోవాలి. **'క్షణే నష్టే కుతో విద్యా, కణే నష్టే కుతో ధనం'** - 'ఒక్క క్షణమైనా వృథా చేసిన వారికి విద్య రాదు, ఒక్క కణాన్ని (ధాన్యపు గింజ) వృథా చేసిన వారికి సంపద కలగదు'. కాబట్టి విద్యార్థులు వ్యర్థ ప్రసంగాలతోనూ; దృశ్య, శ్రవణ పరికరాల వినియోగాల్లోనూ సమయాన్ని వృథా చేయకుండా జాగ్రత్త వహించాలి. పాఠ్యాంశాలతో పాటు మనస్సును మంచి ఆలోచనలతో నింపే పుస్తకాల్ని చదవాలి. ఏకాగ్రచిత్తంతో జ్ఞాన సముపార్జన కోసం ప్రతి క్షణాన్నీ వినియోగించడమే **'విద్యార్థి చేయాల్సిన తపస్సు'**. ❖

# ప్రాథమిక సూత్రాలు

**- స్వామి సుప్రియానంద**

'మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ' – వీటిని భారతీయ సంస్కృతి యొక్క ప్రాథమిక సూత్రాలంటే బాగుంటుంది. ఎందుకంటే నేటి సమాజంలో మానవతా విలువలను పెంపొందించటానికి వీటి అవసరం ఎంతైనా ఉంది.

**మాతృదేవోభవ :** తల్లి తొలి గురువు. పిల్లవాడికి ప్రేమ, ఆప్యాయతలతో సన్మార్గాన్ని చూపే దేవత తల్లి. అలాకాక తన పిల్లవాడికి తినుబండారాలను ఇచ్చి "ఎవరికీ ఇవ్వవద్దు ఒక్కడివే తిను" అని చెప్పే తల్లి తన కుమారుణ్ణి స్వార్థపరునిగా మారుస్తుందనడంలో ఆశ్చర్యం లేదు.

ఉరిశిక్ష పడిన ఒక ఖైదీ తన తల్లితో చివరి సారిగా మాట్లాడుతూ "అమ్మా! నేను చిన్నప్పుడు పక్కింటి పెరటిలో తోటకూరను దొంగిలించిన రోజు నన్ను మెచ్చుకున్నావు. అలా చేయడం గొప్పపని అనుకొని దొంగగా మారి, చివరికి హంతకుణ్ణయ్యాను. నేను ఈ రోజు ఉరికంబం ఎక్కడానికి నువ్వే కారణం" అంటాడు. కాబట్టి తల్లి పిల్లలకు నేర్పించాల్సినవి అసూయాద్వేషాలను కాదు, ప్రేమాప్యాయతలను.

**పితృదేవోభవ :** క్రమశిక్షణను నేర్పే తండ్రి గురువు. ఒక తండ్రి తన కుమారుడితో "తొందరగా భోజనం చేసి చదువుకో" అని గట్టిగా చెప్పాడు. కానీ పిల్లవాడు ఆ మాటను లెక్క చేయలేదు. కారణం – తండ్రి రోజూ టీ.వీ. చూస్తూ రెండు గంటల సేపు భోజనం చేస్తాడు. క్రమశిక్షణ సహజంగా, క్రమంగా రావాలి. ఆధిపత్యంతో ఒకరిని శిక్షించవచ్చు కానీ వారిలో 'క్రమశిక్షణ'ను తీసుకురాలేం.

**ఆచార్యదేవోభవ :** ఆచార్యుడు పిల్లవాడికి జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. ఒక పాఠశాలలో ఉపాధ్యాయుడు, "తల్లితండ్రులు దైవ సమానులు. వారికి నమస్కరించాలి. మీలో ఎంతమంది అలా చేస్తున్నారు"అని అడిగారు. విద్యార్థులు ఎవరూ మాట్లాడలేదు. ఒక కొంటె పిల్లవాడు లేచి, "ప్రక్క తరగతిలోని మీ అబ్బాయి మీకు నమస్కరిస్తున్నాడా?" అని ఎదురు ప్రశ్న వేశాడు. ఉపాధ్యాయుడు ఇంటికి వెళ్ళి తన కుమారుడితో ఆ రోజు పాఠశాలలో జరిగింది చెప్పి, "ఇక నుండి నువ్వు రోజూ మీ అమ్మకూ, నాకూ నమస్కరించు" అని చెప్పాడు. అప్పుడు పిల్లవాడు "నాన్నగారూ! తాతయ్య, నాయనమ్మలకు మీరు ఎప్పుడూ నమస్కరించగా నేను చూడలేదు. ఇదేమిటి కొత్తగా నాకు పనిపెడుతున్నారు" అన్నాడు. దీన్ని బట్టి "మనం ఆచరణలో చూపిన వాటినే పిల్లలు అలవరుచుకుంటారు" అని తెలుస్తుంది.

**అతిథిదేవోభవ :** "నాయనా! ఎవ్వరూ పరాయి వారు కాదు. ఈ ప్రపంచమంతా నీదే!" అంటారు శ్రీశారదాదేవి. ఈ కర్మభూమిలో అందరూ కలిసిమెలసి జీవించాలి. అందుకనే అతిథులూ దేవుళ్ళే!

ఈ నాలుగు ప్రాథమిక సూత్రాలు మనం పాటించినప్పుడు అవే– భక్తి, రాజ, జ్ఞాన, కర్మ యోగాలుగా మన ఆధ్యాత్మిక జీవితంలో పరిణతి చెందుతాయేమో! కొంచెం ఆలోచిద్దాం. ❖

With Best Compliments From

**PENNAR INDUSTRIES LIMITED**

**305, Saptagiri Towers, Begumpet, Hyderabad - 500 016**

**పెన్నార్ కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.**

# మనసుంటే మన వెంటే దేవుడు

- స్వామి జ్ఞానదానంద

శ్రీరామకృష్ణులు సజీవులుగా ఉన్న కాలంలోనే అనేక మంది భక్తులకు దివ్య దర్శనాలు ఇచ్చారు. అందులో కొందరు భక్తుల అనుభవాలను తెలుసుకుందాం.

ఒకసారి ఢాకాలో విజయకృష్ణ గోస్వామి తన పూజా మందిరంలో ధ్యానం చేసుకొంటున్నాడు. హఠాత్తుగా గురుదేవులను చూశాడు. నిజానికి అప్పుడు గురుదేవులు దక్షిణేశ్వరంలో ఉన్నారు. ఇది తన భ్రమ అనుకొని అతడు గురుదేవుల దేహాన్ని తాకి చూశాడు. సాక్షాత్తూ గురుదేవులే అని గ్రహించాడు. విజయ్ కలకత్తాకు వచ్చి తన అనుభవాన్ని భక్తులకు తెలియజేశాడు.

నిత్యగోపాల్ ఘోష్ కూడా గురుదేవులను ఢాకాలో దర్శించాడు. ఆ సంఘటనను అతడు ఇలా వర్ణించాడు: "ఢాకాలో ఉన్నప్పుడు నేనెంతో విచారంగా ఉండేవాణ్ణి. నగర శివార్లలో ఉండే అడవి లాంటి ప్రదేశాన్ని శ్మశానంలా వాడుకొనేవారు. నేల మీద ఎవరో వ్యక్తి కూర్చుని ఉండడం కాస్త దూరం నుంచి చూసి ఆశ్చర్యపోయి అతడి వద్దకు వెళ్ళి, 'ఇక్కడ ఏం చేస్తున్నారు?' అని ప్రశ్నించాను. ఆ వ్యక్తి నాతో మాట్లాడాలనే కోరిక వెలిబుచ్చాడు. నాతో చాలా తక్కువే మాట్లాడినప్పటికీ ఆయన పలుకులు నాలోని విషాదాన్నీ, సంశయాన్నీ తొలగించివేశాయి. ఆయన లేచి నడుస్తూ ఆప్యాయంగా, 'నా ప్రియమైన నిత్యగోపాల్! నువ్వు ఇప్పుడు దేనిని ఆలంబనం చేసుకొని ఉన్నావో దానిని వదలకు' అన్నారు. ఆ తరువాత మళ్ళీ ఆయనను నేను చూడలేదు. విజయ్‌కు ఇదంతా పూసగుచ్చినట్లు తెలిపాను. అదే వ్యక్తిని అడవిలో తానూ చూసినట్లు విజయ్ చెప్పాడు. ఆ రోజు రాత్రి నాకొక అద్భుతమైన కల వచ్చింది. ఆ కలలో ఆ దివ్యపురుషునితో మాట్లాడుతున్నట్లూ, ఆయన వచనాలు వింటున్నట్లూ నాకు కనిపించింది. నా ఆనందం వర్ణనాతీతం."

సురేంద్ర మిత్రా తన పూజా మందిరంలో ప్రతి రోజూ ధ్యానం చేసేవాడు. ఒక రోజు అతడికి గురుదేవుల దివ్యత్వాన్ని పరీక్షించాలనే ఆలోచన వచ్చింది. ధ్యానం చేస్తున్నప్పుడు గురుదేవులు కనిపిస్తేనే ఆయనను అవతారంగా పరిగణించాలని నిశ్చయించుకొన్నాడు. ఎంతటి అద్భుతమంటే, కాసేపట్లో గురుదేవులను అతడు తన పూజా మందిరంలో దర్శించాడు. ఆ విధంగా గురుదేవులను పరీక్షించిన తరువాత సురేంద్ర ఆయనను ఆశ్రయించాడు.

ఒకసారి దేవేంద్ర దక్షిణేశ్వరానికి వచ్చినప్పుడు అతడికి మలేరియా జ్వరం సోకింది. వెంటనే గురుదేవులు బాబూరామ్‌ను తోడిచ్చి అతణ్ణి పడవలో కలకత్తాకు తిరిగి పంపించివేశారు. దేవేంద్ర తన బంధువుల ఇంటికి ఎలాగో చేరుకొని, అక్కడ స్పృహతప్పి పడిపోయాడు. నలభై ఒక్క రోజులు అతడు సన్నిపాతంతో పడకపట్టాడు.

తాను ఇంకా దక్షిణేశ్వరంలోనే ఉన్నాననుకొని, అతడు తరచూ శ్రీరామకృష్ణుల నామాన్ని ఉచ్చరించసాగాడు. బాధ విపరీతమైనప్పుడు అతడు కనులు తెరవగా, ఆశ్చర్యకరంగా మంచం పక్కన సాక్షాత్తూ శ్రీరామకృష్ణులు కూర్చుని కనిపించారు.

గురుదేవుల వద్ద మంత్రదీక్ష పుచ్చుకొన్న తరువాత ఏం జరిగిందో దేవేంద్ర ఇలా వర్ణిస్తున్నాడు: "ఆ సమయంలో సర్వత్రా నాకు గురుదేవులు కనిపించారు. వీధిలో నడిచిపోతున్నప్పుడు గురుదేవులు నా ముందు నడిచిపోతూ కనిపించేవారు. కొన్ని సమయాలలో నా వంక చూస్తూ వెళ్ళేవారు. నేను నిలబడ్డప్పుడు, కూర్చున్నప్పుడు ఆయన నా ముందు నిలబడి కనిపించేవారు. గురుదేవులు సదా నాతోనే ఉంటూ తానే నా సర్వస్వం, పరిరక్షకుడు అయినట్లు నాకు అనిపించింది". ❖

## భగవానుని సేవలో

# భక్తశిరోమణి



ప్రేమ స్వరూపం అనిర్వచనీయం. నిజమైన ప్రేమికుడు, తాను ప్రేమించే వ్యక్తికి తన సర్వస్వం ధారపోసి, సేవలందిస్తాడు. అతను దాన్లోనే ఆనందం పొందుతాడు; తన జీవితం సఫలం అయిందని భావిస్తాడు. అత్యంత తీవ్రమైన ప్రేమ ద్వారా తన సుఖాల్ని కూడా త్యజించి గురుదేవుల సేవలో తరించిన భక్తశిరోమణి స్వామి రామకృష్ణానంద. ఆయన సేవా తత్పరతను తెలియజేసే రెండు సంఘటనల్ని మననం చేసుకుందాం :

మద్రాసులో శ్రీరామకృష్ణ మఠం నెలకొని ఉన్న భవనం కట్టిన కొద్ది సంవత్సరాలకే చాలాచోట్ల బీటలు వారింది. వాన కురిసినప్పుడల్లా పై కప్పులో ఏర్పడిన పగుళ్ళ నుంచి నీళ్ళు కారేవి.

ఒకనాటి రాత్రి పూజామందిరంలో కూడా పై కప్పు నుంచి వాన నీరు కారడం మొదలైంది. సరిగ్గా శ్రీరామకృష్ణుల చిత్రపటం మీద వాన నీళ్ళు పడుతున్నాయి. వెంటనే స్వామి ఒక గొడుగును తెచ్చి, రామకృష్ణుల చిత్రపటం మీద ఆ గొడుగు తెరిచి పట్టుకున్నారు. రామకృష్ణుల చిత్రపటాన్ని మాత్రం ఉన్నచోటు నుంచి కదల్చలేదు. అలా కదిలిస్తే, గురుదేవులకు నిద్రాభంగమవుతుంది అని వాన వెలిసే వరకూ ఆ రాత్రంతా గొడుగు పట్టుకుని స్వామి రామకృష్ణానంద అలాగే నిలబడ్డారు.

ఒకరోజు స్వామి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో మధ్యలో ఎందుకో ఆయన మనస్సులో హఠాత్తుగా రామకృష్ణులు ఎంతగానో ఇష్టపడే వేడి వేడి లూచీలు తయారుచేసి, ఆయనకు తినిపించాలని కోరిక కలిగింది. అలా అనుకున్న తక్షణమే ఆయన లేచి పిండి కలిపి, లూచీలు చేసి, వేయించడం మొదలుపెట్టారు. శ్రీరామకృష్ణుల (చిత్రపటం) ముందు ఒక పళ్ళెం ఉంచారు. అప్పటికప్పుడు వేడి వేడిగా కరకరలాడుతున్న లూచీలను ఒకదాని తరువాత మరొకటిగా ఆ పళ్ళెంలో వేస్తూ, గురుదేవులకు వాటిని నివేదించారు. శ్రీరామకృష్ణులు తన ఎదురుగా కూర్చొని, తన కిష్టమైన లూచీలను ఆస్వాదిస్తున్నారనే అనుభూతి ఆయనకు కలిగింది. ❖

(జూలై 20న శ్రీరామకృష్ణ పరమహంస సన్న్యాస శిష్యులైన **స్వామి రామకృష్ణానంద జయంతి**)

---

బలరామ్ బోస్ ఆఖరి కుమార్తె కృష్ణమయి. ఒకరోజు తమ ఇంట్లో స్వామి బ్రహ్మానందజీ (రాజా మహరాజ్), స్వామి శారదానందజీ (శరత్ మహరాజ్) విందు భోజనం చేస్తున్నట్లు ఆమె కలగన్నది. తన కల నిజం కావాలని తలచి ఒకరోజు స్వాములిద్దరినీ తమ ఇంటికి సాదరంగా విందుకు ఆహ్వానించింది. స్వాములిద్దరూ ఆ రోజు బలరామ్ ఇంటికి విచ్చేశారు. రాజా మహరాజ్ వద్ద బలరామ్‌బోస్ మనుమలు, మనుమరాళ్ళకు బాగా చనువు. స్వాములు రావడం వాళ్ళకు ఎంతో ఆనందదాయకమయింది. కృష్ణమయి అమిత భక్తి ప్రపత్తులతో అనేక వంటకాలు చేసి స్వాములకు విందు ఏర్పాటు చేసింది. స్వాములు కూడా ఆమె సేవలను ఎంతో ప్రీతితో స్వీకరించారు. మధ్యాహ్నం కాసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత, స్వాములు బేలూర్ మఠానికి బయలుదేరారు. బండి ఎక్కబోతూ రాజా మహరాజ్ బలరామ్‌బోస్ పెద్ద మనుమరాలితో 'మీ అమ్మను తరచూ ఇలాంటి కలలు కనమని చెప్పు!' అని నవ్వుతూ అన్న మాటలు అక్కడున్న వారందరికీ వినోదాన్ని పంచాయి. ❖

స్వామి భూతేశానంద
(1901-1998)

(స్వామి భూతేశానందజీ మహరాజ్ స్మృతులు– 'రసబోధ' పుస్తకం నుంచి)

సేకరణ: బ్రహ్మచారి సేవాచైతన్య

# పరమేశ్వరుని పరిరక్షణలో ...

## స్వామి జపానంద స్వీయ అనుభవాలు -25

# దయగల దేవుడు ద్వారకానాథుడు

స్వామి జపానంద చాతుర్మాస దీక్షాకాలం ద్వారకలో గడుపుదామన్న ఆలోచనతో ప్రయాణమయ్యారు. పోరుబందర్ నుంచి సుదామపురి మీదుగా ద్వారక వెళ్ళారు. దోవలో అయోధ్యవాసి అయిన ఒక వైష్ణవ భక్తుడు కూడా కలిశారు. అలా ఇద్దరూ కలసి ద్వారక చేరుకున్నారు.

ద్వారకలో ఇద్దరూ గోమతీనదిలో స్నానం చేసి, దైవ దర్శనం చేసుకున్నారు. ఆ తరువాత అక్కడ ఉండడానికి సరైన వసతి కోసం వెతకడం ప్రారంభించారు. వైష్ణవ సత్రంలో వైష్ణవ భక్తునికి వసతి లభించింది. కానీ జపానంద చాతుర్మాస సమయమంతా అక్కడ గడపాలని అనుకున్నారు. అన్ని రోజులు వైష్ణవసత్రంలో బస ఇవ్వడానికి సత్రం అధికారులు నిరాకరించారు.

శంకర భగవత్పాదులు స్థాపించిన శంకర మఠానికి వెళ్ళారు. పీఠాధిపతి ఆ సమయంలో అక్కడ లేరు. ఆ సమయంలో మఠ కార్యకలాపాలు చూసే అధికారి ప్రవర్తన బాగాలేదు. అందుకని అక్కడ నుంచి వెళ్ళిపోతుండగా అక్కడే ఉన్న మరొక వ్యక్తి "శ్మశానం దగ్గర నదీ తీరంలో ఒక కృత్రిమ గుహ ఉంది. అక్కడ ఉండే సాధువు ఈ మధ్యనే దివంగతులయ్యారు. ప్రస్తుతం అక్కడ ఎవరూ లేరు. పక్కనే ఒక బావి ఉంది. మీరు అక్కడ ఉండవచ్చు" అని స్వామి జపానందతో చెప్పాడు.

నదీతీరంలో ఇటుకలు పేర్చి ఆ గుహ కట్టారు. లోపల అంతా ఇసుకతో నిండి ఉంది. అక్కడకు తీసుకుని వచ్చిన వ్యక్తి గుహ లోపల అంతా శుభ్రం చేశాడు. అక్కడ బావి నీళ్ళు కొంచెం ఉప్పగా ఉండడం వల్ల నది నుంచి నీళ్ళు తెచ్చి కమండలం నిండా నింపి పెట్టాడు. మర్నాడు ఉదయం ఆలయంలో కలుస్తానని చెప్పి అతను వెళ్ళిపోయాడు. ఏకాంతంగా ఉన్న ఆ ప్రదేశం సన్న్యాసికి చాలా నచ్చింది. రాత్రి ప్రశాంతంగా గడిచి పోయింది. ఒక వైపునున్న చిన్న కిటికీలో నుంచి చల్లటి గాలి వీస్తోంది. మర్నాడు ద్వారకా ధీశుని దర్శనార్థం ఆలయానికి వెళ్ళారు. వైష్ణవ భక్తుడు కూడా వచ్చాడు. ఇద్దరూ శ్రీకృష్ణుని లీలల గురించి మాట్లాడుకున్నారు. మధ్యాహ్నం అవుతూ ఉండగా వైష్ణవ భక్తుడు తన నివాసానికి వెళ్ళిపోయాడు. సన్న్యాసి కొంచెంసేపు అక్కడే కూర్చొని, తన నివాస స్థానమైన గుహకు తిరిగి వచ్చారు. సన్న్యాసికి ఎవరూ భిక్ష ఇవ్వలేదు. అందువల్ల రోజంతా నీళ్ళు తాగి గడిపారు. శ్రీకృష్ణుని రాజ్యమైన ద్వారకలో మొదటి రోజు ఉపవాసం ఉండాల్సి వచ్చింది.

సన్న్యాసి మర్నాడు ఉదయం లేచి, నదిలో స్నానం చేశారు. ఆలయానికి వెళ్ళి ద్వారకా నాథుణ్ణి దర్శించుకోవాలనుకున్నారు కానీ చాలా నీరసంగా ఉండడం వల్ల గుహకు తిరిగి వెళ్ళిపోయారు. 'ఇలాగే నీరసంతో ఇక్కడే జీవితం ముగిసిపోతుందేమో! తీర్థస్థలంలో అదే అయితే మంచిదే. అంతా భగవంతుడి దయ' అనుకున్నారు.

సమయం మధ్యాహ్నం రెండో మూడో అయి ఉంటుంది. ఇద్దరు స్త్రీలు ఒక బాలుడితో కలసి అక్కడకు వచ్చారు. "మహరాజ్! ఈ రోజు మీరు ఆలయానికి రాలేదేమి? నిన్న కూడా మీరు చాలా నీరసంగా కనిపించారు.

ఆరోగ్యం బాగా లేదా? నిన్న భోజనం ఎక్కడ చేశారు?" అని ఒక స్త్రీ అడిగింది.

సమాధానం చెబుతున్నట్లు సన్న్యాసి కమండలం చూపించారు. వెంటనే ఆమె అర్థం చేసుకుని "అయ్యో! మీరు రెండు రోజులుగా ఏమీ తినలేదు. బాబూ త్వరగా బజారుకి వెళ్ళి వీరికోసం తినడానికి ఏమైనా తీసుకుని రా" అని ఆ బాలుణ్ణి బజారుకి పంపింది. బాలుడు తినుబండారాలు తీసుకొని రాగానే అవన్నీ ప్రేమతో సన్న్యాసికి పెట్టారు. ఆ తరువాత నిత్యం ఆమె వచ్చి, సన్న్యాసి యోగక్షేమాలు కనుక్కునేది; భోజన సదుపాయాలు కూడా చూసేది. ద్వారకానాథుని దయ వల్ల స్వామి జపానందజీ చాతుర్మాస దీక్ష నిర్విఘ్నంగా పూర్తిచేశారు. ❖

**అనువాదం : శ్రీమతి జి.ఎస్. లక్ష్మి**

# దేవీ వైభవం

ప్రవచనం: **శ్రీ సామవేదం షణ్ముఖశర్మ** విలేఖనం: **శ్రీమతి ఎన్. శేష**

(...గత సంచిక తరువాయి)

ఏ దేవత దగ్గరకు వెళ్ళినా ఆ దేవతలో మనకు అభయముద్ర, వరదముద్ర అనే రెండు ముద్రలు కనిపిస్తాయి. అభయముద్ర అంటే నీ భయాలు నేను పోగొడతాననే రక్షణ. వరదముద్ర అంటే కురిపించడం. అభయముద్ర ఊర్ధ్వాన్నీ (పరతత్త్వాన్నీ), వరదముద్ర భగవత్ శక్తి వలన లభించే కోరికల్నీ సూచిస్తాయి. కానీ అమ్మ దగ్గర ఆ ముద్రలు లేవు. ఎందుకంటే ఆవిడ నాలుగు చేతుల్లో మనస్సు, ఇంద్రియాలు, రాగద్వేషాలూ పట్టుకుని ఉంది. అదే ఆత్మ తత్త్వం యొక్క విశేషం. ఎవరైతే ఈ నాలుగింటినీ నిగ్రహిస్తారో వారికి ఆత్మతత్త్వం అవగత మవుతుంది. మన బ్రతుకును బాధ పెట్టే ఈ నాలుగింటినీ అమ్మకి అప్పచెప్తే అమ్మ అదుపు చేస్తుంది.

*త్వదన్యః పాణిభ్యా మభయవ రదోద్దైవత గణాత్వమేకా నైవాసి ప్రకటితవ రాభీత్య భినయాః భయాత్రాతుం దాతుం ఫలమపిచ వాంఛాసమధికం శరణ్యేలోకానాం తవహి చరణావేవ నిపుణౌ* – 'ఇతర దేవతలు అభయ వరద ముద్రలు రెండూ చూపించాలి. కానీ నువ్వలా అక్కర్లేదు అమ్మా' అని శంకరుల వారు అన్నారు. *భయాత్త్రాతుం దాతుం ఫలమపిచ వాంఛాసమధికం* = భయాల నుంచి రక్షించి, మన అవసరాల్ని తీర్చేది అమ్మ. అమ్మ రెండు చరణాలూ కనపడేలా కూర్చుంటుంది. ఎందుకంటే అమ్మ పాదాలు అభయ, వరద స్థానాలు. సత్య ప్రసాదిని, క్షిప్రప్రసాదిని అనే నామాల మర్మం ఇందులో స్ఫురిస్తుంది. ఆ దివ్య చరణాలు, అమ్మ రూపంలో ఉండే శివశక్త్యైక్య లక్షణం, మన జీవితాన్ని కల్లోలపరిచే మనస్సు, పంచ తన్మాత్రలు, రాగ ద్వేషాలు– వీటిని నియంత్రించి ఆత్మ స్వరూపాన్ని ఆవిష్కరింపజెయ్యడం – ఇన్నీ అమ్మ రూపంలో ఉన్నాయి. అందుకు ఆ తల్లి స్వరూపాన్ని చూసినప్పుడు ఈ భావన అంతా మనస్సుకు పట్టి, ఈ భావనతో అమ్మపై భక్తి పెరిగి, ఈ భక్తి ధ్యానంగా పరిణమించి, ధ్యానం జ్ఞానమై, జ్ఞానం ఆ దేవత కైవల్యమనే స్థితికి తీసుకు వెళ్ళడమే ఉపాసన యొక్క అసలు పరమార్థం.

ఇలా మనం లలితా మహా త్రిపురసుందరీ తత్త్వాన్ని వ్యాఖ్యానించుకున్నాం. అమ్మ యొక్క ఈ దయను మనకు బోధించి అమ్మను ఎందుకు ఆశ్రయించాలి అనే విషయాన్ని చెబుతూ, పురాణాలు, ఆగమాలు ఎన్నో విషయాలు చెప్పాయి. పురాణాలు అమ్మ పేరు కానీ, అమ్మ బీజాక్షరం కానీ తెలిసికానీ తెలియకకానీ – ఎలా అన్నా కూడా అది దివ్యమైన ఫలతాన్నిస్తుందని చెబుతున్నాయి. అమ్మ నామ మహిమ, అమ్మని ఆశ్రయించిన మహిమ, అమ్మ ఆరాధన మహిమలను చెప్పి అనేక పురాణాలు మనకు అభయ మార్గాలనూ, వరద మార్గాలనూ చూపిస్తున్నాయి. ఇహలోక సుఖాలు, పరలోక సుఖాలు, పారమార్థిక సుఖమైన కైవల్యం – ఈ మూడింటినీ ఇవ్వగలిగే తల్లి ఆ జగదంబిక అనే విషయం మనకు అన్ని పురాణాలలోనూ, ఉపాసకుల స్వానుభవంలోనూ స్పష్టంగా అవగతమవుతోంది.

మనకు కావలసిన బ్రహ్మవిద్య అంతా ప్రస్తావితమైన ఒక దివ్యగాథను చెప్పుకోబోతున్నాం.

మార్కండేయ పురాణంలో వేదవ్యాస మహర్షి ఇచ్చిన 'దేవీమాహాత్మ్యం' అది. దీనిని 'సప్తశతి' అంటారు. ఉపాసనా మార్గంలో దీన్ని ప్రయోగాలలో చూపినప్పటికీ ఏడువందల మంత్రాలుగా విభజన చేశారు. దాన్ని ఉపాసనలో వినియోగించినప్పుడు చండీ సప్తశతి, చండీ హోమం, చండీ యాగం – ఇలా చెప్పారు. చండీహోమం అనగానే అరిష్టాలన్నీ పోతాయి, సుఖాలు వస్తాయి, శత్రునాశనం జరుగుతుంది అని స్ఫురిస్తుంది. బ్రహ్మవిద్య అంతా దీనిలోనే ఉంది. ఈ బ్రహ్మవిద్యను చెప్పిన మరొక సప్తశతి భగవద్గీత.

దేవీ మాహాత్మ్యంలో అపూర్వమైన ప్రారంభం కనిపిస్తుంది. దీనిలో చెప్పిన కథలన్నీ ఇతర పురాణాలలో ఉన్నవే. దీనిలో ముఖ్యమైనవి – మధు కైటభ సంహారం,

మహిషాసుర మర్దనం, చండ ముండ శుంభ నిశుంభ రాక్షససంహారం. కానీ ప్రారంభం 'సావర్ణిః సూర్య తనయో యోమను కథ్యతేష్టమః నిశామయ తదుత్పత్తిం విస్తరాద్గతో మమ' అని మొదలుపెడతారు. అంటే మార్కండేయ పురాణం మన్వంతరాల కథను చెబుతూ, సావర్ణి మన్వంతరంలోని కథను చెబుతోంది. సావర్ణి మన్వంత రానికి అధిపతి అయిన సావర్ణి అనే మనువు ఎలా ఉత్పన్నమయ్యాడో చెబుతోంది. 14 మన్వంతరాల మనువులు ఎప్పుడూ ఉంటారు; వాళ్ళ వంతు వచ్చినప్పుడు వాళ్ళు దానికి పాలకులు. ఈ మనువులు సాక్షాత్తూ నారాయణ సౌర శక్తులతో కూడుకున్న వారు. ఇప్పుడు నడుస్తున్నది వైవస్వత మన్వంతరం, ఇది ఏడవది. దీని తరువాత రానున్నది సావర్ణి మన్వంతరం, దీని అధిపతి అయిన సావర్ణి ఇప్పుడూ ఉన్నాడు. ఇప్పుడు చెప్పబోయే సావర్ణి మన్వంతరం కథ రెండవ మన్వంతరంలో జరిగిందట. అప్పుడు ఒక రాజు ఉండేవాడు. ఆ రాజుకు అమ్మ వారి అనుగ్రహం వల్ల సావర్ణి మనువుగా అయ్యే యోగ్యత లభించింది.

సావర్ణిః సూర్యతనయ – అమ్మ వారి అనుగ్రహం పొందిన తరువాత అతను సూర్య పుత్రుడయ్యాడు. ఇక్కడ సావర్ణి మనువు కథ క్లుప్తంగా ఉంటుంది, అమ్మ కథే ఎక్కువ.

సప్తశతిలో ఒక్కొక్క శ్లోకంలో అమ్మవారికి సంబంధించిన ఒక్కొక్క బీజాక్షరాలున్నాయి. ఋషులు రచించిన శ్లోకాలను అనువదిస్తే, భావం అనువదితమవుతుందే తప్ప శక్తి అనువాదం కాదు; శక్తిని అనువదించలేం! 'భాషా రూపా బృహత్ సేనా' – అని ఊరికే అనలేదు. ఆ పలుకులో ఉన్నది దేవతాశక్తి. మహర్షులు రచించారంటే అందులో ఏవో శక్తులు పెడతారు. అందుకే వాటిని పారాయణ చేస్తే అంత ఫలితం. అప్పయ్య దీక్షితులవారు ఒక్కశ్లోకానికి ఉన్న అంతరార్థం మనకి వివరించారు. "సావర్ణిః సూర్య తనయః యో మనుః కథ్యతేష్టమః" అన్నదానిలో మనుః అంటే మంత్రం. ఇక్కడ ఒక మనువు చెప్పబడుతోంది అంటే ఒక మంత్రాధిదేవత ప్రస్తావితమవుతోంది. ఆ ఉత్పత్తి చెబుతున్నానన్నాడు, ఉత్పత్తి అన్నప్పుడు ఆ మంత్రాధిదేవత అయిన అమ్మ ఉత్పత్తి, సావర్ణి యొక్క ఉత్పత్తి కాదు. అందుకు 'నిశామయ తదుత్పత్తి' – తత్ ఉత్పత్తిం – తత్ యొక్క ఉత్పత్తి – అదెవరు; మనుః = మంత్రం. ఆ మంత్రం ఎలాగ ఉన్నదో అది చెప్తున్నారు. 'సావర్ణిః' అంటూ ప్రారంభమే 'సా'తో మొదలుపెట్టారు. కేనోపనిషత్తులో అమ్మ వారి గురించి 'సా బ్రహ్మేతి' అని వస్తుంది. అలాగే 'సాదేవీ జగదండ మసృజతః సైషా సా యేషా దేవీ' – 'సా' అనేది అమ్మకే, మరెవరికీ లేదు. 'సా' అంటే ఆమె అని అర్థం. సావర్ణి అంటే 'ఈం' అని అర్థం. 'సూర్యతనయః' అంటే సూర్యునికి సంబంధించి నది కనుక తేజస్సు అని అర్థం. తేజోవాచకమైన అక్షరం 'ర' కారం తీసుకోవాలి. మంత్రోద్ధారణం అంటే అలా ఉంటుంది. "ఈం", "ర" – రెండు వచ్చాయి. 'యో మనుః కథ్యతే అష్టమః' – య అష్టమః అంటే "య" శబ్దం నుండి ఎనిమిదవది (య, ర, ల, వ, శ, ష, స, హ) – హ. ఇప్పుడు 'ఈం ర హ' – ఇది అటువైపు నుండి చదవాలి. ఋషులు మంత్రం నేరుగా చెప్పరు. కావ్యాల్లో, శ్లోకాల్లో మంత్రం నేరుగా చెప్పరాదు. మంత్ర మర్యాద చాలా జాగ్రత్తగా కాపాడాలి. ఇందులో ఎంత జాగ్రత్తగా మంత్రం నిబద్ధం చేశారో! అలా 'హ ర ఈం' కలిపితే "హ్రీం" అయింది. "హ్రీం" బీజం భువనేశ్వరి అయిన జగదంబికది. హ్రీం బీజస్వరూపిణి. ఆ తల్లి యొక్క 'ఉత్పత్తిం నిశామయ' వివరిస్తున్నారు, విను' అంటున్నాడు మార్కండేయుడు. సావర్ణి మనువు కథ భౌతికార్థాన్ని చెప్తే, అంతరార్థం అమ్మ గురించి తెలియజేస్తుంది. ❖ **సశేషం**

# మనస్సును జయించడానికి మందు!

నాయనా! రామా! ఇప్పుడు ఈ 'చిత్తం' అనే ఘోర వ్యాధిని నిర్మూలించడానికి ఒక గొప్ప 'ఔషధం' మీ అందరి ముందూ ఉంచుతాను. ఈ ఔషధం సేవించడానికి ఎవరూ ఎక్కడికీ వెళ్ళనక్కర్లేదు; ఎవ్వరినీ ఆశ్రయించవలసిన అవసరం లేదు. ప్రతి ఒక్కరి అధీనంలోనూ ఉన్న ఔషధం ఇది. బాహ్య ప్రయత్నాలు, ఇతరుల సహాయం అవసరం ఉండదు. ఇది పురుషార్థ సాధకం. ఉత్తమ సుఖదాయకం కూడా.

ఆ 'ఔషధం' విశేషాన్ని చెబుతున్నాను. శ్రద్ధగా వినండి: "ఇష్ట వస్తువుల పట్ల ఏర్పడే వృత్తిని త్యజించటం". ఈ 'చిత్తం' అనే బేతాళుణ్ణి నిరోధించాలంటే 'వాంఛిత వస్తువు'... అనే దాన్ని త్యజించివేయాలి. మంచి విషయాలను విని, మననం చేయగలిగిన మనస్సు గల ఓ రామచంద్రా! దుఃఖాగ్నిలో పరితప్తమవుతున్న ఈ మనస్సును మరొక మనస్సుతో జయించివేయాలి. మనస్సుతోనే మనస్సును జయించాలి. ఈ రెండవ మనస్సును చింతా రాహిత్యం, శాస్త్ర-సత్సంగాలు, ధీరత్వం, ప్రశాంతతలతో నింపి వేయాలి.



ఒక బాలుడు దుష్ట-తుచ్ఛ కార్యాలు నిరంతరం చేస్తున్నాడనుకో! అప్పుడు ఏం చేస్తాం? అతణ్ణి అనేక ఉపాయాలతో సరిదిద్దడానికి ప్రయత్నిస్తాం.

సామ, దాన, భేద, దండోపాయాలను సమయోచితంగా తగినంతగా ఉపయోగించి అతణ్ణి మరొక ఉత్తమ కార్యంలో వినియోగిస్తాం. అలాగే మనస్సుకి గల 'దృశ్యాసక్తి' అనే ఒక భాగాన్ని "దృశ్య తిరస్కృతి.. ఆత్మాంగీకారం" అనే మరొక భాగంతో నియమించాలి. సమయోచితంగా ఈ నాలుగు ఉపాయాలూ ఉపయోగిస్తూ ఉండాలి. ఇందులో కష్టం ఏమీ లేదు. కొంత ప్రయత్నశీలుడవై, "ఈ దృశ్యం వాస్తవం కాదు కదా! దీనిలో నాకు ఆసక్తి ఎందుకు ఉండాలి? కాబట్టి అన్ని పరిస్థితులలోనూ, అన్ని వేళలలోనూ 'ఈ దృశ్యం అవాస్తవమే' అనే ఎరుక కలిగి ఉంటాను" అని నిర్ణయించుకో. నీ దృష్టిలో ఈ దృశ్యం అవాస్తవమైనదిగా సుస్థిరపడినప్పుడు ప్రాప్తించే స్థితినే 'సమాధి' అని అంటున్నాం. అలాంటి నిశ్చల సమాధి స్థితిలో నియమితులై ఉన్నవారు ఇక ఆ యా కార్యక్రమాలను నిశ్చింతగా, అనాసక్తి పూర్వకంగా, సంగరహితంగా, ఉద్వేగరహితంగా నిర్వర్తించవచ్చు.

ఓ రాఘవా! బాహ్య విషయాలను అభిలషించడం అనే జాడ్యాన్ని నిరాకరించడం (లేక) త్యజించడం నీ అధీనంలోనే ఉంది సుమా! దానికి గురువులు గానీ, మరింకెవరో గానీ ఏం చేయగలరు చెప్పు? నీవే దాని కోసం ప్రయత్నించాలి. అలాంటి ప్రయత్నం నీకు సర్వదా హితకరం.

అభిలాషను జయించడం అనే వైరాగ్యవృత్తిని అనుసరించని వాడు కీటకంతో పోల్చదగినవాడు.

శ్రీరాముడు: స్వామీ! ఏవేవో రమణీయమైన వస్తువులు మా ఎదుటకు వస్తూ, పోతూ ఉంటాయి. వాటి పట్ల ఆకర్షణ - వికర్షణలు ఏర్పడకుండా చూసుకోవడం ఎలా సాధ్యం?

శ్రీ వశిష్ఠ మహర్షి: ఆత్మ సాక్షాత్కారరూప భావన వల్ల అది సుసాధ్యమే! రమణీయమైన - అరమణీయమైన వస్తువులు, ఇష్టమైన వారు - అనిష్టమైన వారు తారసపడడం కద్దు! అయితే, ఇవన్నీ కూడా పరమోత్తమమైన పరబ్రహ్మ రూపాలే, పరమాత్మకు చెందినవే కదా!" అని భావిస్తూ ఉండు. అప్పుడు గొప్ప మల్లయోధుడు, ఒక బాలుణ్ణి జయించినట్లు నీవు ఈ చిత్తాన్ని జయించగలవు.

ఓ జనులారా! ధ్యానం, ప్రార్థన, తపస్సు, పూజ, దానం, సత్సంగం, విచారణ లాంటి ఆత్మ సాక్షాత్కారరూప పురుష ప్రయత్నాలను మీరు ఆశ్రయించండి! అప్పుడే మనస్సును తప్పక జయించగలరు. ఆ విధంగా జయించిన మనస్సు అప్రయత్నంగానే బ్రహ్మాన్ని పొందుతుంది. ❖

('శ్రీవసిష్ఠ రామ సంవాదం'
ఉత్పత్తి ప్రకరణం ఉత్తరార్ధం నుంచి)

**అనువాదం : వై. హెచ్. రామకృష్ణ**

ధీరవాణి

-స్వామి వివేకానంద

# ప్రోత్సాహంతో పురోభివృద్ధి!

ఐరోపాలో అనేక నగరాలలో సంచరించాను. అక్కడ పేద ప్రజలకు సైతం లభిస్తున్న చదువు, సౌఖ్యాలను చూశాను. వెంటనే మన పేద ప్రజల స్థితి గుర్తుకి వచ్చి కన్నీరు కార్చేవాణ్ణి. ఈ భేదానికి కారణం ఏమిటి? 'విద్యే' – అనే జవాబు నాకు స్ఫురించింది. చదువు చేత, ఆత్మవిశ్వాసం చేత వారిలోని బ్రహ్మం మేలుకొంటుండగా మనలోని బ్రహ్మం క్రమక్రమంగా నిద్రాణమవుతోంది. న్యూయార్కుకి ఐర్లాండువారు వలస వచ్చేటప్పుడు ఒత్తిళ్ళకు గురై, పీక్కుపోయిన ముఖాలతో, దీనావస్థలో ఉండేవారు. ఒక చేతి కఱ్ఱ, దాని చివర వేలాడే పీలికల మూట... ఇదే వారి ఆస్తి. నడకలో జంకు, చూపులో భయం కాన వచ్చేది. ఆరు నెలల్లో ఆ దృశ్యం మారిపోయి వారంతా ధైర్య ఉత్సాహాలతో కనిపించేవారు. వారి చూపుల్లో, నడకల్లో ఇక ఎలాంటి భీతీ ఉండేది కాదు. కారణం ఏమిటి? ఆ ఐరిష్ వాడికి స్వదేశంలో ఎటు చూసినా తిరస్కారమే. అందరూ ముక్తకంఠంతో 'ఒరేయ్! నీ కిక ఆశ లేదు. బానిసగా పుట్టావు. బానిసగానే ఉంటావు' అనే నిరాశను పెంచే మాటల్నే పుట్టినప్పటి నుంచీ వినేవాడు. అలాంటి మాటల్ని విని విని తాను చాలా అల్పుణ్ణనే భ్రాంతిలో ఉండేవాడు. అందువల్ల అతడిలో ఉన్న ఆత్మశక్తి ముకుళించుకొని పోయేది.

అలాంటి స్థితిలో అతడు అమెరికాలో అడుగుపెట్టాడో లేదో, వెంటనే అన్ని వైపులా అతడికి "అబ్బాయీ! మా లాగ నువ్వూ ఒక మానవుడివి. మానవుడు ఏ పనైనా చెయ్యగలడు. ధైర్యంగా ఉండు" అనే ఘోష వినవస్తుంది. వాడు తలెత్తి చూసి, అది నిజమే అని గుర్తిస్తాడు. అతడిలోని బ్రహ్మం మేలుకొంటుంది.

మన పిల్లలు నేరుస్తున్న విద్య కూడా వ్యతిరేకమైనది. దాని ఫలితంగా శ్రద్ధ అంతరిస్తుంది. వేదవేదాంతాల్లో ప్రముఖంగా ఉద్ఘోషించే శ్రద్ధ... యముడి ముందు నిలబడి ప్రశ్నించే ధైర్యం... నచికేతుడికి వచ్చిన శ్రద్ధ... ఈ జగత్తును నడుపుతున్న శ్రద్ధ – అలాంటి శ్రద్ధ అంతరిస్తుంది! శ్రద్ధారహితుడు, సంశయాత్ముడు నశిస్తాడు. కాబట్టి మనం వినాశానికి అత్యంత సమీపంలో ఉన్నాం. ప్రస్తుతం దానికి విరుగుడు విద్యా వ్యాప్తే!

మొట్టమొదట ఆత్మబోధ. ఆత్మబోధ అనగానే జడలు కట్టిన శిరోజాలు, దండ కమండలాలు, కొండ గుహలు తలపునకు వస్తాయి. కానీ నేను చెప్పదలచింది అది కాదు. మనలో అనంత శక్తి దాగి ఉంది. బ్రహ్మ పిపీలికాది పర్యంతం ఉన్న ఆత్మ అభిన్నం. ప్రకటనలో మాత్రమే భేదం. అవకాశం, సరైన దేశకాల పరిస్థితులు సమకూరినప్పుడు వెంటనే ఆ శక్తి ఆవిష్కృతమవుతుంది. బ్రహ్మాది స్తంభ పర్యంతం వ్యక్తం గానో, అవ్యక్తం గానో ఉన్న శక్తి ఒక్కటే. ప్రతి వారిలో ఉన్న ఆ శక్తిని జాగృత పరిచేందుకు సహకరించేదే నిజమైన విద్య. ❖

# పరిప్రశ్న

- స్వామి సుకృతానంద

**నం.ల. నరసింహారావు, హైదరాబాద్**

**? :హనుమంతుణ్ణి నవ వ్యాకరణ పండితుడు అంటారు. ఎందువలన? నవ వ్యాకరణాలు ఏవి?**

✍: శ్రీమద్రామాయణంలోని కిష్కింధకాండలో మొట్టమొదట రామలక్ష్మణులను ఆంజనేయ స్వామి దర్శించి వారెవరో తెలుసుకోగోరుతాడు. దూతగా వచ్చి వారి వివరాలు అడిగే విధానాన్ని గమనించిన దాశరథి, సౌమిత్రితో 'ఋగ్, యజుర్, సామవేదాలు, వేదాంగాలను అధ్యయనం

చేయనివాడు ఈ విధంగా మాట్లాడలేడు' అని అతణ్ణి అభినందిస్తాడు. శ్రీ సూర్యభగవానుని నుండి రామదూత శాస్త్రాధ్యయనం చేశాడు.

నవ వ్యాకరణాలు అంటే 1. పాణినీయం 2. కలాపం 3. సుపద్మం 4. సారస్వతం 5. ప్రాతిశాఖ్యం 6. ఐంద్రం 7. వ్యాఘ్ర భౌతికం. 8. శకటాటాయనం 9. శాకల్యం (ప్రాతిశాఖ్యానికి కుమార వ్యాకరణం అని మారుపేరు ఉంది.)

**దాలి నాయుడు, రాజాం**

**? : బాబా గుడికి వెళుతూ అక్కడ ధ్యానమందిరంలో రామనామం జపిస్తున్నాను. అలా చేయవచ్చా?**

✍: మామూలుగా అయితే అలా చేయకూడదంటారు కొందరు. ఏ దేవుడి గుడికి వెళితే ఆ దేవతనే స్మరించాలంటారు. అయితే మీరు వెళ్ళే గుడికి భక్తులు వస్తారు, అక్కడ పవిత్ర వాతావరణం ఉంటుంది కనుక ఏ దేవత జపం చేసినా ఫలితం లభిస్తుంది. 'భావగ్రాహి జనార్దన' అని కదా పెద్దలు చెబుతారు. శ్రీరామచంద్రుణ్ణి హృదయంలో ధ్యానిస్తూ, హరే రామ జపం చేస్తే తప్పక ఫలితం ఉంటుంది.

**హనుమంతరావు, తలుపూరు**

**? : అ) షట్ సంపత్తి ఆ) అన్వీక్షణి ఇ) ప్రమాత, ప్రమేయం, ప్రమితి, ప్రమాణాలను గురించి వివరించ ప్రార్థన.**

✍: అ) షట్ సంపత్తి అంటే ఆరు సంపదలు, ఐశ్వర్యాలు, విభూతి అనే అర్థాలు ఉన్నాయి. ఏమిటా ఐశ్వర్యాలు? ఆత్మ సాక్షాత్కారానికి శమాది షట్ సంపత్తి అవసరం. 1. 'శమ' అంటే మనసు బాహ్య విషయాలపైకి వెళ్ళకుండా నియంత్రించడం. 2. 'దమ' అంటే జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాల్ని నియంత్రించడం. 3.'ఉపరతి' బాహ్య విషయాలను చిత్తవృత్తులతో ఆశ్రయించకుండా, పూర్వమీమాంసలో చెప్పబడిన విహిత కర్మల్ని వదలిపెట్టడం. 4) 'తితిక్ష' అంటే ఏ దుఃఖాన్ని అయిన ప్రతీకార రహితంగా ఓర్చుకోవడం. అపకారం చేసినవారికైనా హాని తలపెట్టకపోవడం. 5) 'శ్రద్ధ' అంటే శాస్త్రాల్నీ, గురువు ఉపదేశించిన వాక్యాల్నీ సత్యబుద్ధితో అర్థం చేసుకోవడం. 6) 'సమాధానం' అంటే సర్వకాల సర్వావస్థల్లో ధ్యేయ వస్తువు (భగవంతుడి)పై మనస్సును లగ్నం చేయడం. వివేకం, వైరాగ్యం తీవ్ర ముముక్షత్వంతో పై ఆరు ఐశ్వర్యాలూ ఉంటే ఆత్మసాక్షాత్కారం కరతలామలకం అవుతుంది.

ఆ) 'అన్వీక్షణి' అంటే అన్వేషణ అని భావం.

ఇ) ఇక ప్రమాణాది చతుష్టయాన్ని తెలిపే పదాలు– ప్రమాత, ప్రమాణ, ప్రమేయ, ప్రమితి.

'ప్రమాత' – అంతఃకరణాల (మనసు, బుద్ధి, అహంకారం, చిత్తం)తో విషయాన్ని గ్రహించేవాడు. 'ప్రమాణం' – విషయ నిర్ణయానికి సాధనాలు. 'ప్రమేయం'– ప్రమాణాలతో నిర్ణయించబడినది. 'ప్రమితి' – యథార్థ ప్రత్యక్షం.

ఇవన్నీ వేదాంత పరిభాషలోని సాంకేతిక పదాలు, జ్ఞాన యోగసాధనలో అంతర్భాగాలు. యుక్తి విషయాలు కూడా. ❖

- రెంటాల జయదేవ

# పాంచజన్య ప్రార్థన

ఆలయాలలోనూ, ఇళ్ళల్లోనూ దేవునికి సమీపంలో పీఠం మీద శంఖాన్ని ఉంచుతుంటారు. భక్తులను సమున్నత సత్యాన్వేషణ దిశగా మరల్చడం కోసం శంఖంతో తీర్థం ఇస్తుంటారు.

మన ప్రాచీన గ్రంథాల్లో శంఖ ప్రార్థనను ఇలా పేర్కొన్నారు:

***త్వం పురా సాగరోత్పన్నః విష్ణునా విధృతః కరే।***
***దేవైశ్చ పూజితః సర్వైః పాంచజన్య నమోఽ స్తు తే॥***

'సముద్రంలో నుంచి పుట్టినదీ, శ్రీమహావిష్ణువు చేతిలో ఉండేదీ, దేవతలందరూ పూజించేదీ అయిన పాంచజన్య శంఖానికి నమస్కరిస్తున్నాను'.

## లక్ష్మీదేవి తమ్ముడే దక్షిణావర్త శంఖం!

సాధారణంగా శంఖాల్లో చాలా భాగం ఎడమ వైపునకు తెరుచుకొని ఉంటాయి. మరో మాటలో చెప్పాలంటే, అవి అపసవ్య దిశలో ఏర్పడినవన్న మాట. ఇక, కుడి వైపునకు తెరుచుకొని ఉండే శంఖాలు, అంటే సవ్య దిశలో ఏర్పడిన శంఖాలు అరుదుగా లభిస్తాయి. ఇలా కుడి వైపునకు తెరుచుకొని ఉన్న శంఖాలనే పండితులు 'దక్షిణావర్త శంఖాలు' అని వ్యవహరిస్తుంటారు. ఇలాంటి శంఖం ఇంట్లో పూజగదిలో ఉండడం శుభప్రదమని హిందువుల విశ్వాసం. అయితే, వీటి ధర చాలా ఎక్కువ.

సమస్త సంపదలకూ సంకేతమైన లక్ష్మీదేవి ఇలా కుడి వైపునకు తిరిగిన (దక్షిణావర్త), తెల్లటి శంఖంలో నివాసమై ఉంటుందని ప్రజల నమ్మకం. తెల్లటి శంఖం, లక్ష్మీదేవి – రెండూ సముద్రంలోనే పుట్టాయని భావిస్తారు. కుడి వైపు తెరచి ఉన్న తెల్లటి శంఖాన్ని లక్ష్మీదేవికి తమ్ముడిగా విశ్వసిస్తారు.

దక్షిణావర్త శంఖం గొప్పదనాన్ని మన శాస్త్రాలు ఇలా వివరించాయి:

***దక్షిణావర్తే శంఖాయం యస్య సద్మని తిష్ఠతి।***
***మంగళాని ప్రకుర్వన్తే తస్య లక్ష్మీః స్వయం స్థిరా॥***

***చందనాగరు కర్పూరైః పూజయేద్ గృహేఽ న్వహమ్।***
***స సౌభాగ్యే కృష్ణ సమో ధనే స్యాద్ ధనదోపమః॥***

'ఏ ఇంట్లో అయితే కుడి వైపునకు తెరుచుకొని ఉన్న తెల్లటి శంఖం ఉంటుందో, ఆ ఇంట్లో సంపదలు, సంతోషం వెల్లివిరుస్తాయి. సాక్షాత్తూ లక్ష్మీదేవే ఆ ఇంట్లో వసిస్తుంది. దేవుణ్ణి నిత్యం పూజించడానికి చందనం, కర్పూరం వగైరా ఏ ఇంట్లో వినియోగిస్తారో ఆ ఇల్లు ధనం, సౌభాగ్యాలతో తులతూగుతుంది'.

## దేవతలకు నెలవు దక్షిణావర్త శంఖం

ఇక, 'బ్రహ్మవైవర్త పురాణం' దక్షిణావర్త శ్వేత శంఖం గురించి ఇలా చెబుతోంది:

***శంఖ చంద్రార్క దైవత్యం మధ్యే వరుణ దేవతన్।***
***పృష్ఠే ప్రజాపతి ర్విద్యా దగ్రే గంగా సరస్వతీమ్॥***

***త్రైలోక్యే యాని తీర్థాని వాసుదేవస్య చాజ్ఞయా।***
***శంఖే తిష్ఠన్తి విప్రేంద్ర తస్మా శంఖ ప్రపూజయేత్॥***

***దర్శనేన హి శంఖస్య కిం పునః స్పర్శనేన తు।***
***విలయం యాన్తి పాపాని హిమవద్ భాస్కరోదయేః॥***

'దక్షిణావర్తమైన తెల్లటి శంఖం దివ్యత్వంలో సూర్య చంద్రులతో సమానమైనది. ఈ శంఖం అగ్ర భాగంలో గంగ నివాసం ఉంటుంది. మధ్యలో వరుణుడు, పృష్ఠ భాగంలో బ్రహ్మ వసిస్తుంటారు. శ్రీమహావిష్ణువు ఆదేశాల మేరకు ముల్లోకాలలోని అన్ని తీర్థాలూ ఈ శంఖంలో ఉంటాయి. కుబేరుడు సైతం ఈ శంఖంలో కొలువై ఉంటాడు. దీన్ని నిత్యం పూజించాలి. ఈ శంఖాన్ని చూసినంత మాత్రాన సూర్యోదయంతో మంచు కరిగిన రీతిలో అన్ని దోషాలూ నశిస్తాయి. ఇక ఈ శంఖాన్ని స్పృశిస్తే, దివ్యత్వం సిద్ధిస్తుంది'.

## శంఖనాదం ఎప్పుడు చేయాలి?

అయితే, శంఖాన్ని ఎప్పుడు పడితే అప్పుడు ఊదకూడదు. కేవలం ఉదయం, సాయంత్ర వేళల్లోనే శంఖాన్ని ఊదాలి. అదీ సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయం తరువాత అని పెద్దలు చెబుతుంటారు. అలా కాకుండా మిగిలిన సమయాల్లో శంఖం ఊదితే, ఆ నాద తరంగాలకు సూర్య కిరణాలు ఆటంకమవుతాయని అంటారు. ఏమైనా, వాతావరణం ప్రశాంతంగా ఉండే ఉదయ, సాయం వేళల్లో శంఖం ఊదితే, ఆ నాదం చాలా దూరం వినిపిస్తుంది. శంఖనాదం విన్న వారంతా దాని వల్ల ప్రయోజనం పొందుతారు. ❖

('శుభాలనిచ్చే శంఖం' వచ్చే సంచికలో...)

# విశాల హృదయుడు హరగోవిందుడు

కథ: మోహన్ చిత్రాలు: శంకర్ తెలుగుసేత: స్వామి జ్ఞానదానంద



5 హరగోవింద సింగ్ గాంభీర్యం, పవిత్రత జహంగీరును బాగా ఆకట్టుకున్నాయి. ఆయనను ఖైదు చేయాలనే ఉద్దేశాన్ని మానుకొని, జహంగీర్ చాలా మర్యాదగా ప్రవర్తించాడు. ఎన్నో మత తత్త్వాల గురించి ఆయనతో సంభాషిస్తూ, తన సందేహాలను తీర్చుకున్నాడు.

6 ఒకసారి జహంగీర్ చక్రవర్తితో పాటు హరగోవింద్ వేటకు బయలుదేరాడు. కారడవిలో చక్రవర్తిని ఒక పెద్ద పులి తరుముకుంటూ వచ్చినప్పుడు, ఆయన రక్షక భటులందరూ భయంతో పారిపోయారు. అప్పుడు హరగోవింద్...

హరగోవింద్ ఆ పులితో పోరాడి దాన్ని చంపేశాడు. దాంతో, చక్రవర్తికి హరగోవింద్ మీద ఉన్న గౌరవమర్యాదలు ఎన్నో రెట్లు పెరిగాయి.

7 హరగోవింద్‌తో చక్రవర్తి చాలా చనువుగా ఉండడం సంతూషాలో అసూయని కలిగించింది. హరగోవింద్‌నూ, చక్రవర్తినీ విడదీయాలి; సాధ్యమైతే హరగోవింద్‌ను చంపేయాలని కుట్ర పన్నాడు. అందుకు తగ్గట్లు హఠాత్తుగా జహంగీర్ చక్రవర్తి జబ్బు పడ్డాడు.

8




మిగతా 36వ పేజీలో...

# ఆదర్శ గురువు
# శ్రీ శారదా దేవి

–ప్రవ్రాజిక ధర్మాత్మప్రాణ



శ్రీరామకృష్ణులు మొదటి నుంచీ శ్రీశారదాదేవికి ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం ఇచ్చారు. 'చందమామ అందరికీ మామ. అలాగే భగవంతుడు మనందరకీ తండ్రి' అని చెబుతూ, జపధ్యానాలు, ప్రార్థనలు ఎలా చెయ్యాలో కూడా అమ్మకు నేర్పించారు. తాను భావ పారవశ్యంలో ఉన్నప్పుడు ఏ యే సమయాల్లో ఏ యే మంత్రాలు ఉచ్చరించాలో నేర్పుతూ మంత్రాలకు సంబంధించిన జ్ఞానాన్ని కూడా ఇచ్చారు. షోడశీ పూజ చేసి, తమ సమస్త సాధనా ఫలాన్ని జపమాలతో సహా అమ్మ పాదాల వద్ద సమర్పించారు. రాబోయే కాలంలో అమ్మ ఆదర్శ గురువయ్యేందుకు అలా సాయం చేశారు.

చివరి రోజుల్లో శ్రీరామకృష్ణులు కాశీపూర్‌లో ఉన్నప్పుడు ఒకసారి అమ్మను "నీవేమీ చెయ్యవా? కలకత్తా ప్రజలు పురుగుల్లాగ కొట్టుమిట్టాడుతున్నారే" అంటే, అమ్మ "నేను స్త్రీని ఏం చెయ్యగలను?" అన్నారు. కానీ శ్రీరామకృష్ణుల ఆదేశానుసారం ఎన్నెన్నో బాధ్యతలను చాలా సహజంగా, ధైర్యంగా విచక్షణతో ఆమె నిర్వహించారు. ఆ బాధ్యతలలో అత్యంత ప్రముఖమైనది 'గురువు పాత్ర'. ఆమె జీవితంలో ఆదర్శ గురువుగా అసంఖ్యాక భక్తులకు మార్గదర్శి ఎలా అయ్యారనేది చూద్దాం:

**రాళ్ళను రత్నాలుగా మార్చిన మాతృ ప్రేమ:** "అమ్మా" అని ఎవరైనా ఆర్తితో ప్రార్థిస్తే, ఎంత కష్టమైనా కూడా లెక్కించకుండా వారికి మంత్రదీక్ష ఇచ్చేవారు. సదాచార బ్రాహ్మణ కుటుంబానికి చెందిన స్త్రీ అయినప్పటికీ, ఏ జాతి, ఏ కులం, ఏ మతం వారినైనా ఆమె దగ్గరకు తీసుకునేవారు. బందిపోటు దొంగ అమ్‌జాద్ కానీ, పాశ్చాత్య వనిత సోదరి నివేదిత కానీ, సాధు బ్రహ్మచారులు కానీ – అందరినీ సమానంగా చూసేవారు. ఒక్కొక్కసారి అమ్మ మాతృభావం గురుభావాన్ని మీరిపోయేది. ఆ మాతృభావంలో మానవులు, జంతువులు, పశుపక్ష్యాదులన్నింటికీ సమాన స్థానం ఉండేది. ఆ కాలంలో ఇలాంటి ఆచరణ సమాజంలో సంచలనాన్ని సృష్టించే విషయమని మనం ఊహించవచ్చు.

పవిత్రులకూ, శుద్ధ భక్తులకూ దీక్ష ప్రసాదించేటప్పుడు అమ్మ మనస్సుకు ఎంతో ఆనందంగా, తృప్తిగా ఉంటుందనీ; ఘోర సంసారాసక్తులు నమస్కరించినప్పుడు పాదాల్లో మంటపుట్టి, గంగాజలంతో కడుక్కోవలసి వచ్చేదనీ చెప్పేవారు. అత్యంత పవిత్రులైన సన్న్యాస శిష్యులు ఒక వైపు అయితే, ఘోరసంసారాసక్తులు మరొక వైపు; నాగమహాశయ్ లాంటి వినమ్ర భక్తులు ఒక వైపు అయితే, అమ్‌జాద్ లాంటి బందిపోటు దొంగలు మరొక వైపు... ఇలా రకరకాల భక్తులను ఆమె అత్యంత సహనంతో, సమానంగా చూశారు.

"శ్రీరామకృష్ణులేమో రత్నాల వంటి వారిని ఏరుకున్నారు. కానీ నా దగ్గరకు చీమల బారుల్లాగ అసంఖ్యాకులను పంపారు. పచ్చికట్టెలను ఊది ఊది, కళ్ళ నుండి నీళ్ళు కారి, కళ్ళు వాచిపోయాయి" అనేవారు అమ్మ. అయినప్పటికీ ఎవరికీ కాదనకుండా దీక్ష ప్రసాదించేవారు.

**నియమాలకు అతీతం అమ్మ మంత్రదీక్షా విధానం:** మంత్రదీక్ష ఇవ్వడంలో నియమ నిబంధనలను అమ్మ ఎక్కువగా పాటించేవారు కాదు. సాక్షాత్తూ జగజ్జనని, పవిత్రతా స్వరూపిణి అయిన అమ్మకు ఇవి అవసరం లేదు.

ఒకసారి శారదామాత విష్ణుపూర్ రైల్వే స్టేషన్‌లో కలకత్తా వెళ్ళేందుకు వేచి ఉండగా, హఠాత్తుగా ఒక రైల్వే కూలీ అమ్మ పాదాల వద్ద ప్రణమిల్లి 'అమ్మా జానకీమాతా! నీ దర్శనం కోసమే ఇన్నాళ్ళూ వేచి ఉన్నాను. నన్ను కరుణించి కాపాడు తల్లీ!' అంటూ విలపించాడు. అమ్మ అతణ్ణి ఆశీర్వదించి అక్కడే మంత్రదీక్ష ప్రసాదించారు.

దృష్టి ద్వారా, స్పర్శ ద్వారా, స్వప్నంలో కూడా ఎంతో మందికి అమ్మ ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించారు. శ్రీరామకృష్ణుల నిర్యాణానంతరం అమ్మకు ఆయన దర్శనమిచ్చి యోగీన్ (స్వామి యోగానంద)కు దీక్ష నివ్వమని చెప్పి ఆమెలో సుప్తంగా ఉన్న గురుశక్తిని మేల్కొల్పారు.

సురేంద్రసేన్ అనే భక్తుడు స్వామి వివేకానందుల ద్వారా ప్రభావితుడై 3 సంవత్సరాలు ఆయన్ని మంత్రదీక్ష కోసం ప్రాథేయపడ్డాడు. స్వామి వివేకానందులు ఆయనకు దీక్ష ప్రసాదించేందుకు ఒప్పుకున్నారు. కానీ ధ్యానంలో ఆయన గురువు వేరే అని తెలుసుకుని "నీకు నాకంటే గొప్ప వారి దగ్గర మంత్రదీక్ష దొరుకుతుంది" అన్నారు. స్వామి వివేకానందుల కన్నా గొప్పవారు ఎవరున్నారని అత్యంత బాధతో నిరాశా నిస్పృహలతో వెళ్ళిపోయారు ఆయన. తరువాత ఆయనకు కలలో అమ్మ కనిపించి, మంత్రదీక్షను ఇచ్చారు.

**అమ్మ అభయం ముక్తిదాయకం:** ఒక భక్తుడు అమ్మ వద్ద మంత్రదీక్ష పొందాడు కానీ తాను సాధనలు సరిగ్గా చేయలేకపోతున్నాను అని దుఃఖంతో 2, 3 సంవత్సరాలు అమ్మ దగ్గరకు వెళ్ళలేదు. చివరికి చాలా బాధతో అమ్మకు వినయంగా ఒక ఉత్తరం వ్రాశాడు. దాన్ని చూసి అమ్మ అతణ్ణి రమ్మని కబురు పంపారు. "నాయనా! చెరువులోని నీరు తనను లాక్కోమని సూర్యుణ్ణి కోరాలా? నీరు కోరినా కోరక పోయినా సూర్యుడు నీటిని పైకి లాక్కొంటాడు. భయపడకు. నీవే సాధనలూ చేయనవసరం లేదు" అని అమ్మ అభయప్రదానం చేసారు. ఒక్క అవతార పురుషులకు మాత్రమే ఇలాంటి అభయమివ్వడం సాధ్యం.

ఇంకొక శిష్యుడు అమ్మ దగ్గరకు వచ్చి, తన కష్టాలను వివరించి మనోవేదనతో ఏడుస్తూ, "అమ్మా! నా జీవితం నాశనమైపోతుందా? నేనేం చెయ్యను? నా గతి ఏమిటి?" అని ఆవేదనతో అడిగాడు. తక్షణమే అమ్మ "ఏమంటున్నావు నాయనా! నా బిడ్డ ఏనాడూ నాశనమవడు. ఇక్కడకు వచ్చిన వారందరికీ ముక్తి నిశ్చయం. భగవంతుడు కూడా నా బిడ్డను ఏమీ చెయ్యలేడు" అన్నారు. "అమ్మా! మరి నన్ను ఏం చెయ్యమంటారు" అంటే, "భారమంతా నా మీద వేసి నిశ్చింతగా ఉండు" అని అమ్మ, ఆ భక్తుడికి అభయదానం చేసారు.

**అమ్మ సూచనతో అద్భుత ఫలితం:** స్వామి విరజానందులు రోజుకు పద్దెనిమిది గంటల సేపు ధ్యానం చెయ్యనారంభించారు. దాంతో ఆయన ఆరోగ్యం బాగా దెబ్బ తిన్నది. తలనొప్పితో ఏమీ చెయ్యలేకపోయేవారు. ఎన్ని చికిత్సలు చేయించినా ఫలితం లేదు. అప్పుడు గురువైన అమ్మ దగ్గరకు ఆయన వచ్చారు. అమ్మ తన శిష్యుణ్ణి చూసిన వెంటనే, "నాయనా! నీవు ఇంత చిక్కిపోయావే! అసలు నీవు ధ్యానంలో మనస్సును ఎక్కడ కేంద్రీకరిస్తావు" అని అడిగారు. "అమ్మా! నా మనస్సును శిరస్సులో కేంద్రీకరిస్తాను" అన్నారు. అప్పుడు అమ్మ, "అందుకే నాయనా! నీకు ఇంత తలనొప్పి. శిరస్సులో మనస్సును కేంద్రీకరించడం అన్నది చిట్టచివరి మెట్టు. నీ మనస్సును హృదయంలో కేంద్రీకరించు" అన్నారు. అలాగే గురువైన అమ్మ ఆదేశానుసారం స్వామి తమ ధ్యాన పద్ధతిని మార్చుకున్నారు. ఆశ్చర్యకరంగా కొద్ది రోజులలోనే ఆయన కోలుకున్నారు.

**సంఘ గురువుగా మాతృమూర్తి:** సంఘ గురువుగా అమ్మ ఎలా తన బాధ్యతను నిర్వహించారో చూద్దాం. ప్లేగు వ్యాధి వచ్చినప్పుడు కలకత్తాలో రామకృష్ణ మఠం వారు సేవ, సహాయ చర్యలు చేపట్టారు. ఆర్థిక వనరులు కొరవడి, పని ఆగేలా ఉన్న స్థితిలో స్వామి వివేకానందులు, 'అవసరమైతే బేలూరు మఠాన్ని అమ్ముదాం' అన్నారు. అది విని అమ్మ "ఇదేం మాట! ఒక్క సేవా కార్యంతోనే మఠాన్ని మూసివేస్తారా? మీరేమో చెట్ల క్రింద నైనా ఉండగలరు. కానీ తరువాత కాలంలో వచ్చే నా బిడ్డలు అలా ఉండలేరు?" అన్నారు.

స్వామి వివేకానందుల ఉత్తేజ పూరితమైన ఉపన్యాసాలను విన్న యువకులు మఠంలో చేరి, దేశ భక్తి, దేశ సేవే ముఖ్యమని భావించారు. అయితే మఠంలో ఆధ్యాత్మికతకు ఇచ్చిన ప్రాముఖ్యాన్ని చూసిన వారందరి మనసుల్లో సందేహం కలిగింది. అప్పుడు అమ్మ, "గురుదేవులను ఆదర్శంగా ఉంచుకొని పని చెయ్యండి. అప్పుడు దారి తప్పరు. ఊరకే దేశప్రేమ, దేశసేవ అంటూ ఏం సాధించ గలరు" అని అంటూ ఆ శిష్యులకు మార్గదర్శనం చేశారు.

శ్రీరామకృష్ణ సంఘంలో అమ్మ ఎన్నడూ అధ్యక్షపదవిలోనో, మరే పదవిలోనో లేరు. అయితే అమ్మ తీర్పు అత్యున్నత న్యాయస్థానం తీర్పు లాంటిది. ఒక సన్న్యాస సంఘానికి ఒక స్త్రీ నేతృత్వం వహించడం మన ఇతిహాసాల్లో ఎక్కడా కనీవినీ ఎరుగని విషయం. అమ్మ ఏనాడూ ఉపన్యాసాలు ఇవ్వలేదు, గ్రంథాలు వ్రాయలేదు కానీ అమ్మ జీవితం మొత్తం ఆదర్శప్రాయమే! ❖



# ఓ మహాత్యాగి ఆత్మకథ

## (స్వామి వివేకానంద స్వీయ వచనాల సమాహారం)

(...గత సంచిక తరువాయి)

(మహా భక్తుడు, అద్వైత వేదాంతి, కర్మయోగి, ప్రవక్త, శ్రేష్ఠసన్న్యాసి, గురువు, యుగాచార్యుడు, దేవదూత, పరమహంస శిష్యుడు, మానవ జాతి ప్రేమికుడు, మహా దేశభక్తుడు, ధ్యానసిద్ధుడు, మహాయోగి, గంధర్వ గాయకుడు ఇలా విభిన్న రూపాలలో స్వామి వివేకానంద మనకు దర్శనమిస్తారు. స్వామీజీ సంభాషణలు, ఉపన్యాసాలు, వ్యాసాలు, లేఖల్లో స్వయంగా తెలిపిన తన జీవితానుభవాలను ధారావాహికగా జూన్,09 సంచిక నుంచి అందిస్తున్నాం.)

**విద్యలో విలువల బోధ :** ప్రాథమిక పాఠశాలలో కొంచెం సంఖ్యా గణితం, సంస్కృత వ్యాకరణం, భాషా విజ్ఞానం... ఇవన్నీ నేర్పేవారు. ఒక 'నైతిక శిక్షణ' పుస్తకం నుంచి కొన్ని సూక్తులు కంఠస్థం చేసేవాళ్ళం. అందులో నాకు బాగా గుర్తున్న ఒక నీతి: "గ్రామ శ్రేయస్సు కోసం కుటుంబాన్ని విడిచిపెట్టవచ్చు; దేశ శ్రేయస్సు కోసం తన గ్రామాన్నే వదలి వెళ్ళవచ్చు; మానవజాతి శ్రేయస్సు కోసం దేశమైనా విడిచిపెట్టవచ్చు; విశ్వ శ్రేయస్సు కోసం సర్వస్వమూ త్యజించవచ్చు." ఇలాంటి సూక్తులు ఆ పుస్తకంలో ఉండేవి. వాటిని మేము చదవగా ఉపాధ్యాయుడు వివరించేవారు.

మొదటి రోజు నేను పాఠశాలకు వెళ్ళినపుడు నాకు నేర్పిన శ్లోకం అర్థం ఇది: "ఎవరైతే స్త్రీలందరినీ తన సొంత తల్లిలా గౌరవిస్తాడో, పరుల ధనసంపదలను ధూళి మాత్రంగా భావిస్తాడో (ఆశించకుండా ఉంటాడో), ప్రతి జీవినీ ఆత్మస్వరూపంగా దర్శిస్తాడో – అతడే నిజమైన జ్ఞాని".

**అరుదైన దివ్యానుభూతులు :** ప్రతీరోజూ నేను నిద్ర పోవడానికి కళ్ళు మూయగానే, కనుబొమల మధ్య ఒక అద్భుతమైన బిందువును చూసేవాణ్ణి. అది క్రమంగా రంగురంగులతో పెద్దదవుతూ, మెల్లగా ఓ బంతి ఆకారంగా మారి, ఆఖరికి ఆ జ్యోతి పుంజం విస్ఫోటమై నా శరీరాన్ని ఆపాదమస్తకమూ ఓ తెల్లని జ్యోతి ద్రవ్యంతో ముంచివేసేది. వెంటనే నేను స్పృహ కోల్పోయి నిద్రలోకి జారుకునేవాణ్ణి. అందరూ ఈ విధంగానే నిద్ర పోతారని చాలా రోజుల వరకూ అనుకునేవాణ్ణి. నేను పెద్దవాణ్ణి అయి ధ్యానాభ్యాసం ప్రారంభించాక, నేను కళ్ళు మూయగానే ఆ జ్యోతి బిందువు ప్రత్యక్షమయ్యేది. నేను ఆ జ్యోతిపై మనస్సును ఏకాగ్రం చేసేవాణ్ణి. ఆ రోజుల్లో కొందరు మిత్రులతోపాటు మహర్షి దేవేంద్రనాథ్ టాగూర్ గారి సూచన ప్రకారం ధ్యానాభ్యాసం చేసేవాణ్ణి. మాకు కలిగిన దర్శనాలు, అనుభూతుల గురించి మాలో మేము మాట్లాడుకునేవాళ్ళం. అప్పుడే నాకు తెలిసింది – వారెవరికీ అలాంటి జ్యోతిదర్శనం కాలేదనీ, ఎవరూ అలా నిద్రలోకి వెళ్ళలేదనీ!

స్కూల్లో చదువుతున్నప్పుడు ఓ రాత్రి నా గదిలో తలుపులు మూసుకొని ధ్యానం చేస్తున్నాను. మనస్సు గాఢంగా ఏకాగ్రమైంది; అలా ఎంతసేపు ధ్యానించానో చెప్పలేను. ధ్యానం పూర్తయిన తర్వాత కూడా అలాగే కూర్చుండిపోయాను. అప్పుడు ఆ గది దక్షిణం వైపు గోడ నుంచి ఒక దివ్యమూర్తి బయటకు వచ్చి, నా ముందు నిలబడింది. ఆ మూర్తి ముఖంపై అద్భుతమైన తేజస్సు తాండవిస్తోంది! ఆ తేజస్వి వదనం అత్యంత ప్రశాంతంగా ఉంది. చేతిలో దండ కమండలాలు ఉన్నాయి. ఆయన నా వైపు తదేకంగా చూశారు. నాకేదో ఉపదేశింపబోతున్నట్లు కనిపించారు. నేను నిశ్చేష్టుణ్ణై ఆయన వైపు తదేకంగా చూస్తున్నాను. అంతలో హఠాత్తుగా ఒక విచిత్రమైన భయం నన్ను ఆవరించింది. తలుపు తీసుకొని, వడివడిగా బయటకు వెళ్ళిపోయాను. తర్వాత అలా పారిపోవడం నా మూర్ఖత్వమనీ, బహుశా ఆయన నాకేదో ఉపదేశించి ఉండేవారనీ అనిపించింది. కానీ ఆ తర్వాత ఆ దివ్యమూర్తి మరెప్పుడూ కనపడలేదు. చాలాసార్లు మళ్ళీ ఆ సన్న్యాసి కనిపిస్తే భయపడకుండా మాట్లాడాలని అనుకున్నాను, కానీ మళ్ళీ ఆయనను చూడనేలేదు! ఈ విషయమై మరేం చేయాలో నాకు తోచలేదు.

ఆనాడు నేను చూసింది 'బుద్ధ భగవాను'ణ్ణి అని ఇప్పుడు నాకనిపిస్తోంది. నా బాల్యం నుండే నేనొక వ్యక్తిని కలిసినా, ప్రదేశాన్ని సందర్శించినా నాకు చిరపరిచితమైనట్లు అనిపించేది. మరి ఆ విషయమై వివరాలు గుర్తు చేసుకుందామని ఎంత ప్రయత్నించినా విఫలమయ్యేవాణ్ణి! కానీ ఆ స్ఫురణ మాత్రం వస్తూనే ఉండేది.

**అమోఘమైన ధారణాశక్తి :** ఒకమారు పరీక్షకు కేవలం 2, 3 రోజులకు ముందు నాకు రేఖాగణితంలో ప్రవేశం లేదని గ్రహించాను. వెంటనే రేఖాగణిత పుస్తకం చదవడం ప్రారంభించాను. రాత్రంతా మేలుకుని నిష్ఠతో చదివాను. 24 గంటలలో 4 పుస్తకాల్ని ఆపోశన పట్టేశాను!

ఏ రచయిత పుస్తకమయినా ప్రతీ పంక్తి చదవనవసరం లేకుండానే అర్థం చేసుకునేవాణ్ణి! ప్రతి పేరాలోని మొదటి, ఆఖరి పంక్తులు చదవగానే పేరా మొత్తం అర్థమయ్యేది. ఈ ధారణాశక్తి వృద్ధి పొందే కొద్దీ, పేరాలు చదవడం కూడా అవసరమయ్యేది కాదు. ప్రతీ పేజీలో మొదటి, ఆఖరి పంక్తులు చదవగానే ఆ పేజీలోని విషయమంతా అర్థమయ్యేది. ఆ తర్వాత పుస్తకంలో రచయిత ఏదయినా విషయాన్ని వర్ణించడానికి నాలుగైదు, ఇంకా ఎక్కువ పేజీలు తీసుకున్న సందర్భాలలో ఆ రచయిత చెప్ప దలచుకున్న సారాంశం మొదటి కొన్ని పంక్తులు చదవగానే నాకు తేట తెల్లమయ్యేది.



**శాశ్వతానందానికి సరైన మార్గం:** యౌవనంలో నేను నిద్రకు ఉపక్రమించగానే, ప్రతీ రాత్రీ రెండు ఆదర్శాలు నా కళ్ళ ముందు నిలిచేవి. ఒక దృశ్యం నేను ఎనలేని సంపదలతో ఎంతో మంది సేవకులతో, నాపై ఆధారపడిన వారితో, గొప్ప హోదా, అధికారం, గౌరవం, వైభోగాలతో తులతూగే కోటీశ్వరునిలాగ కనిపించేది. ప్రపంచంలో ధనికులుగా పేరు పొందిన వారందరికీ నాయకత్వం వహించే స్థాయికి నేను చేరుకోగలననే దృఢ విశ్వాసం ఉండేది! మరుక్షణమే నేను సర్వసంగ పరిత్యాగినై, కౌపీనధారినై, సన్న్యాసిగా వైరాగ్య జీవితాన్ని గడుపుతూ, అయాచితంగా దొరికింది తింటూ, రాత్రులు చెట్ల నీడన తలదాచుకుంటూ, సంపూర్ణంగా ఈశ్వరేచ్ఛకు శరణాగతుడనై, ఋషులు, మునుల లాగ జీవిస్తున్నట్లు అనిపించేది! ఈ రకంగా నా భవితను తీర్చిదిద్దుకోవడానికి రెండు పరస్పర విరుద్ధ ఆదర్శాలు నా మనస్సులో మెదిలేవి. కానీ ఈ రెండో ఆదర్శమే నా మనస్సును కట్టిపడేసేది! నిజమైన, శాశ్వతమైన ఆనందాన్ని పొందడానికి ఇదే సరైన మార్గమనీ, ప్రాపంచిక మార్గాన్ని విడిచి, ఈ దారినే నేను నడవాలనీ భావించేవాణ్ణి! ఆ సన్న్యాస జీవితపు ఆనందాన్ని తలపోస్తూ, భగవచ్చింతనలో మునిగిపోయి, అలాగే నిద్ర పోయేవాణ్ణి. అత్యంత ఆశ్చర్యకరంగా చాలా కాలం పాటు ప్రతీ రాత్రీ ఇలాగే జరిగేది!

**తపనను తీర్చే తపస్వి సందర్శనం:** 19వ శతాబ్ది ప్రారంభంలో ఆధ్యాత్మికత, మతం, ధర్మం అంతరించి పోతాయేమో అనే పరిస్థితి ఎదురైంది. తీవ్రమైన ఆధునిక వైజ్ఞానిక పరిశోధనల సమ్మెట పోట్ల క్రింద విశ్వాసాలు నలిగిపోతున్నాయి. ఆధ్యాత్మికత అంటే కేవలం కొన్ని అర్థరహితమైన ఆచారాలుగా, బాహ్యాడంబరాలుగా భావించేవారు. నిరాశతో దిక్కుతోచనివారయ్యారు అంతా తమ చేతుల మధ్య నుండి జారి పోతున్నది; నాస్తికత, భౌతిక వాదం ఉవ్వెత్తున లేచే అలలై, అన్నిటినీ, అందరినీ తుడిచి పెట్టేయడం అనివార్యమనిపించింది!

నా యువావస్థలో ఈ సంశయ భూతం నన్నూ ఆవహించింది. ఆధ్యాత్మికత ధర్మాలు అనే ఆశలు అన్నీ వదులుకోవడం తప్పదని పించింది. కానీ అదృష్టవశాత్తూ నేను క్రైస్తవ, ఇస్లాం, బౌద్ధ మొదలైన మతాలను బాగా అధ్యయనం చేశాను. హిందూ మతం బోధించే మూల సిద్ధాంతాలనే అన్ని మతాలూ బోధిస్తున్నాయని గ్రహించి ఆశ్చర్యపోయాను.

సకల మతాల మూలతత్త్వం ఒక్కటే అని నాకు తోచింది. మరి అసలైన సత్యం ఏమిటి? అని ప్రశ్నించింది నా అంతరాత్మ! ఈ కలకత్తా మహానగరంలో కుర్రవాడిగా ఆధ్యాత్మిక అన్వేషణలో తిరిగేవాణ్ణి! గొప్ప గొప్ప వక్తల ఉపన్యాసాలు విని, వారిని "అయ్యా! మీరు భగవంతుణ్ణి చూశారా?" అని ప్రశ్నించేవాణ్ణి. భగవంతుణ్ణి 'చూడడమా?' అనే ఆలోచనతో ఆ వక్తలు నిర్ఘాంతపోయేవారు. కేవలం ఒకే ఒక్క వ్యక్తి "నేను భగవంతుణ్ణి దర్శించాను. అంతేకాదు, నీకు కూడా భగవంతుణ్ణి దర్శించే మార్గం చూపుతాను" అన్నారు. ఆయనే శ్రీరామకృష్ణ పరమహంస! ❖ సశేషం

అనుసృజన : స్వామి అర్చనానంద

# అణకువతో సాధించిన 'ఆత్మజ్ఞానం'

- స్వామి సమర్పణానంద

ఆయోధ ధౌమ్యుడు గొప్ప వేదాంత ఆచార్యుడు. సేవ, విధేయతలకు సంబంధించి తన శిష్యుల నుండి పూర్తి నిబద్ధతను కోరేవాడు ఆయన. ఆయన అనుకున్న విధంగా నిలచిన వారు మాత్రమే ఆయన అపారకృపకు పాత్రులయ్యేవారు.

ఆరణి, ఉపమన్యుడు ధౌమ్యుడి శిష్యులలో ప్రధానమైన వారు. ఉపమన్యుడి గురించి సామవేదంలోని వంశబ్రాహ్మణ ఖండంలో చెప్పబడింది. అతను వ్యాఘ్రపాదుడనే ముని కుమారుడని కొందరంటే వశిష్టముని పుత్రుడైన వాసు కుమారుడని కొందరంటారు. గొప్ప శైవయోగిగా ప్రసిద్ధికెక్కిన ఉపమన్యువు "నమఃశివాయ" మంత్రాన్ని ఆవిష్కరించాడు.

ధౌమ్యుడి పర్ణశాలలోకి అడుగుపెట్టగానే ఉపమన్యుడి ప్రతిభకి మార్గం ఏర్పడింది. పర్ణశాలలో శిక్షణ అనే కొలిమిలో పడి ఆచార్యుడి ఉపదేశాలు అనే సుత్తిదెబ్బలను (తింటూ) స్వీకరిస్తూ పురోగమించాలని అతనికి తెలియదు. గురువుగారి ఆదేశాలని అనుసరించడానికి అణకువ-విధేయతలనే కష్టతరమైన మార్గంలో పయనిస్తూ శాశ్వత కీర్తి అనే వసారాలో తనకి తెలియకుండానే అడుగుపెట్టినట్లు కూడా ఆ బాలుడికి తెలియదు.

సాంప్రదాయ బద్ధమైన భారతీయ శిక్షణాపథంలో వివేకాన్ని గ్రహణధారణా సామర్థ్యం - నేర్చుకున్న దానిని గ్రహించి జ్ఞాపకం ఉంచుకోవడం - అంటారు. చాలామంది తెలివైన వాళ్ళు జ్ఞానసముపార్జనలో విఫలులవడానికి కారణం వారు తాము నేర్చుకున్నదానిని జ్ఞప్తిలో ఉంచుకోలేకపోవడమే. తన గురువుపట్లా, తాను నేర్చుకుంటున్న విషయం పట్లా వినమ్రత కలిగి ఉన్న వ్యక్తికి ఈ ధారణా సామర్థ్యం- నేర్చుకున్న దానిని జ్ఞప్తిలో ఉంచుకునే సామర్థ్యం - వృద్ధి చెందుతుంది. వినమ్రత విధేయతలు అతడి ధారణాశక్తిని నిలపడానికీ, వృద్ధిచేయడానికీ తోడ్పడతాయి. ఇవిలేని వ్యక్తి ఎక్కువ నీటిని నిలువచేయలేని పాత్ర వంటివాడు. శ్రద్ధ, వినయం, పాత్రత... ఇవి విద్యాభ్యాసానికి పునాదుల వంటివి. గురువు ఆజ్ఞను పాటించడానికి శిష్యుడు చూపాల్సిన విధేయతకీ, దానివలన కలిగే ఫలితాలకీ ఉపమన్యుడు మేటి ఉదాహరణ.

గురువు ఆశ్రమానికి వచ్చినప్పటికి ఉపమన్యుడు చిన్న బాలుడు. ఆశ్రమ నియమానుసారం భిక్షాటన చెయ్యడం, ఆశ్రమంలోని ఆవులను మేపడం వంటి నిత్యకృత్యాలను నిర్వహించేవాడు. ఆశ్రమ జీవనానికి తనని తాను సగౌరవంగా నీతి నిజాయతీలతో సమర్పించుకున్నాడు.

**ఉపమన్యుని గురుభక్తి :** ఒకరోజు ఆవుల్ని మేపి తీసుకుని వచ్చిన బాలుణ్ణి "ఆహారం ఏం తీసుకుంటున్నావు"అని ప్రశ్నించాడు గురువు. తాను భిక్షాటన చెయ్యగా వచ్చినది ఆహారంగా స్వీకరిస్తున్నట్లు చెప్పాడు బాలుడు. అప్పుడు గురువు

తనకి సమర్పించకుండా భిక్షని ఆహారంగా తీసుకోకూడదని చెప్పగా శిష్యుడు ఇటుపైన అలా చెయ్యనన్నాడు.

మర్నాడు భిక్ష అంతా గురువుగారికి ఇవ్వగా ఆయన శిష్యుడికి ఏమీ ఇవ్వలేదు.

అలా కొంతకాలమయ్యాక బాలుడు ముందులాగే పుష్టిగా కనపడడంతో గురువు బాలుణ్ణి "ఆహారం ఏం తీసుకుంటున్నావు" అని అడిగాడు. అప్పుడు ఉపమన్యుడు రెండవ మారు భిక్షాటన చేసి దానిని స్వీకరిస్తున్నట్లు చెప్పాడు. దానికి ధౌమ్యుడు అది సరైన పద్ధతి కాదని చెప్పాడు. గురువు మాటలు విన్న ఉపమన్యుడు తనకి లభించిన దానితో సరిపెట్టుకోవడమే ఉన్నత జీవనానికి మార్గం అని గ్రహించాడు.

కొంతకాలం తరువాత కూడా బాలుడు ఎప్పటి లాగే బలంగా ఉండడంతో గురువు మళ్ళీ అతడి ఆహారం గురించి ప్రశ్నించాడు. ఉపమన్యుడు ఆవుపాలు స్వీకరిస్తున్నట్లు చెప్పాడు. తన అనుమతి లేకుండా తన ఆవుల పాలు పిండి, తాగడం నేరం అన్నాడు గురువు. శిష్యుడు తన తప్పును గ్రహించి ఇకపై అలా చెయ్యకూడదు అనుకున్నాడు.

మర్నాడు ఆవుల్ని మేత నుండి తీసుకుని వచ్చిన శిష్యుడు ఆకలితో అలమటిస్తున్నట్లు కనపడక పోవడంతో గురువు తిరిగి అదే ప్రశ్న వేశాడు. లేగదూడలు తమ తల్లుల వద్ద పాలు తాగుతుండగా ధార కట్టిన నురుగని స్వీకరించానన్నాడు శిష్యుడు. అప్పుడు గురువు అది తప్పుపని అని వివరించాడు. వెంటనే శిష్యుడు ఇకపైన తన ఆహారం ఏమిటి అని కూడా ఆలోచించకుండా తిరిగి అలా చెయ్యకూడదనుకున్నాడు. కాయధాన్యాలు, ద్రవపదార్థాలు... పాలూ... పాలమీద నురుగా... ఏమీలేవు... జీవనమే కష్టతరమవుతోంది బాలుడికి. అయినా తనకు ఎన్ని ఇబ్బందులు కలిగినా అణకువ అనే ఆదర్శం నుండి ఇసుమంత అయినా వైదొలగలేదు.

**గురుభక్తి ప్రయోజనం :** ఒకరోజు ఆకలి బాధతో ఉపమన్యుడు అడవిలోని జిల్లేడు ఆకులని తిన్నాడు. ఆ ఆకుల వగరు, ఘాటు, ఉప్పదనాల వలన అతడు తన దృష్టిని కోల్పోయాడు. దానికి తోడు తడుముకుంటూ త్రోవ వెదుక్కోవడంలో ఒక గోతిలో పడిపోయాడు. పసి వయస్సులో ఆత్మజ్ఞానం కోసం వచ్చి తన కంటి చూపునే కోల్పోయాడు. అలా లోతైన గోతిలో, చీకట్లో పడి ఉండి పోయాడు.

సాయంకాలం శిష్యుడు ఆశ్రమానికి రాలేదని గమనించిన ధౌమ్యుడు గురువు ఆదేశాలకి బాలుడు కోపగించుకున్నాడేమో అనుకుని ఇతర శిష్యులతో అడవికి వెళ్ళి ఉపమన్యుని కోసం వెతకసాగాడు. అలా వెతకగా వెతకగా ఆఖరికి నిస్సహాయంగా కంటి చూపును కోల్పోయి, ఒంటరిగా ఒక గోతిలో కనపడ్డాడు.

జరిగిన విషయం తెలుసుకున్న గురువు దేవవైద్యులైన అశ్వినీ దేవతలను స్తుతించమనీ వారి అనుగ్రహంతో పోయిన చూపును తిరిగి పొందవచ్చనీ చెప్పాడు. ఉపమన్యుడు ఋగ్వేదంలోని మంత్రాలను రాగయుక్తంగా సరియైన ఉచ్చారణతో పఠించాడు. వెంటనే అశ్వినీ దేవతలు ప్రత్యక్షమై ఒక భక్ష్యాన్నిచ్చి అది తింటే పోయిన చూపు వస్తుందని చెప్పారు.

అయితే గురువుకి సమర్పించనిదే తాను ఏదీ తిననన్నాడు ఆ బాలుడు. దానికి జవాబుగా అశ్వినీ దేవతలు "ఇంతకు ముందు నీ గురువు కూడా మమ్మల్ని ప్రార్థించగా మేము అతనికి ఒక తిను బండారాన్ని ఇచ్చాము, అతను తన గురువుకి సమర్పించకుండానే స్వీకరించాడు. అందుకని నువ్వు కూడా అలాగే చెయ్యొచ్చు" అన్నారు.

వెంటనే "గురువు ఏది చేశాడో అది చెయ్యడం కాదు శిష్యుడి విధి; గురువు చెప్పింది ఆచరించడం శిష్యుడి కర్తవ్యం" అని గుర్తుకు తెచ్చుకుని అశ్వినీ దేవతలని తనని క్షమించమని అడిగి, గురువుకి అర్పించనిదే తాను తిననని చెప్పాడు. బాలుడి వినయాన్ని చూసిన అశ్వినీ దేవతలు సంతోషించి అతణ్ణి "నీ గురుభక్తికి మేమెంతో సంతోషించాం. నీ కంటిచూపు తిరిగివస్తుంది. ఆత్మజ్ఞాన సంపన్నుడవవుతావు" అని దీవించారు.

ఉపమన్యుడు పర్ణశాలకి తిరిగివచ్చాక "అశ్వినీ దేవతలు చెప్పినట్లు సకల వేదశాస్త్రాలూ నీ నాలుక చివరనే ఉంటాయి" అని దీవించాడు ధౌమ్యుడు.

గురువు పట్ల అత్యంత అణకువతో ప్రవర్తించడం వల్లనే ఆత్మజ్ఞాని కాగలిగాడు ఉపమన్యుడు. ❖

## పండుగలు - పర్వదినాలు

### జూలై - 2009

| | | | |
|---|---|---|---|
| 03 | శుక్రవారం | : | ఏకాదశి |
| 07 | మంగళవారం | : | గురు పూర్ణిమ |
| 18 | శనివారం | : | ఏకాదశి |
| 20 | సోమవారం | : | స్వామి రామకృష్ణానంద జయంతి |

### ఆగష్టు - 2009

| | | | |
|---|---|---|---|
| 01 | శనివారం | : | ఏకాదశి |
| 05 | బుధవారం | : | స్వామి నిరంజనానంద జయంతి |
| 13 | గురువారం | : | శ్రీకృష్ణ జయంతి |
| 16 | ఆదివారం | : | ఏకాదశి |
| 19 | బుధవారం | : | స్వామి అద్వైతానంద జయంతి |
| 23 | ఆదివారం | : | వినాయక చతుర్థి |
| 31 | సోమవారం | : | ఏకాదశి |

# పూలమ్మినచోట కట్టెలమ్మడం కష్టమా!

– ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

**ఇమ్ముదప్పు వేళ నెమ్మెలన్నియు దప్పు**
**కాలమొక్కరీతి గడవ వలయు**
**విజయుడనువు దప్పి విరటుని గొల్వడా?**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

**భావం :** 'కాలం కలిసిరానప్పుడు మనం ఉన్న పరిస్థితులు తారుమారవుతాయి. అలనాడు అజ్ఞాతవాస సమయంలో అర్జునుడు విరాటుని సేవలో చేరి బృహన్నలగా వ్యవహరించాడు కదా! అందుకే కాలాన్ని అనుసరించి జీవించాలి' అంటారు యోగి వేమన.

అయ్యో ఓడలు బండ్లయ్యాయి అని కొందరు చింతిస్తారు. అవును ధనవంతులు దరిద్రులు కావడం, అధికారుల అధికారం పోవడం, రాజకీయ వాదులు సింహాసనం నుండి దిగిపోవడం, ఒకరి కీర్తి ప్రతిష్ఠలు హఠాత్తుగా అంతరించి పోవడం... అయ్యో ఇలా జరిగిపోయిందే అని ఎందరో డీలా పడిపోతారు. కొందరు తమ మార్గం నుండి తప్పుకొంటారు. అయితే వేమన దీనిని మరీ అంత తీవ్రంగా తీసుకోరాదంటున్నారు. కాలాన్ని అనుసరించి నడవండి – నిలదొక్కుకోండి అని పిలుపు నిస్తున్నారు. అలనాడు పాండవులు (అర్జునుడు) విరాటరాజు కొలువు కూటంలో తమ పేర్లు మార్చుకొని సేవ చేశారు గదా! ధర్మం అడవుల పాలయినా దానిని మళ్ళీ సింహాసనం పైకి ఎక్కించారు.

మన జీవితంలో కూడా పరిస్థితులు తారుమారై పూలమ్మిన (గౌరవ మర్యాదలు పొందిన) చోటనే కట్టెలు అమ్మాల్సి (అవమానకర పరిస్థితుల్ని ఎదుర్కోవల్సి) వస్తే అధైర్య పడకుండా చేసే పనిలో అదే పట్టుదల, కార్యదీక్ష, నిమగ్నతలను ప్రదర్శించాలి. ❖


*With Best Compliments From*

పక్యాల భాస్కర రావు, మేనేజింగ్ డైరక్టర్ & పక్యాల గిరిజ, డైరక్టర్

**SVISS LABSS LTD.,**

**(Manufacture of Bulk Drugs / Drugs Intermediates)**
**An ISO 9001 : 2000 Certified Company**
**No.88-89, Phase - II, Sipcot Industrial Complex,**
**Ranipet - 632 403, Tamil Nadu.**
**Web Site : www.svisslabss.com**

"Are you growing spiritually? Can you love others? Can you feel oneness with others? Have you peace within yourself? And do you radiate it around you? That is called spiritual growth, which is stimulated by meditation, inwardly, and by work done in a spirit of service outwardly." *- Swami Ranganathananda*

SVISS LABSS కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.

ADVT.

ప్రాచీన గాథలు : జీవన వికాసం

– ఆకెళ్ల రాఘవేంద్ర



## గమనాన్ని సుగమనం చేసే

# గరుడ పురాణం

తప్పుడు పనులు చేయకూడదని మనందరం అనుకొంటాం. కానీ తప్పులు చేయకుండా ఎంతమంది ఉండగలరు? తెలిసో తెలీకో చిన్నదో పెద్దదో గతిలేకో మతితప్పో...ఏదో ఒక తప్పుపని చేయక తప్పని పరిస్థితే అందరిదీనూ! అందులోనూ నేటి ఆధునిక యాంత్రిక జీవనంలో మరీనూ!! మన ఆలోచనలపై, ప్రవర్తనపై, మాటపై, చేతపై గట్టి పట్టు ఉంటే తప్పు, తప్పుడు పనులు చేయక తప్పని పరిస్థితి అనే చెప్పుకోవాలి.

జీవించి ఉండగా ఇహలోకంలో పాపాలు చేస్తే మరణించాక నరకంలో నానా శిక్షలకూ గురవ్వాల్సి వస్తుందని మనందరికీ తెలుసు. మనిషిలో పాపభీతిని కలగజేసి తద్వారా అతని జీవితాన్ని సన్మార్గంలో పెట్టడమే ఈ విశ్వాసం వెనుక ఉన్న లక్ష్యం. ఏయే పాపాలు చేస్తే ఎలాంటి నరకం అనుభవించాల్సివస్తుందో వివరించేదే 'గరుడ పురాణం'. వ్యాసమహాముని రచించిన అష్టాదశ(18) పురాణాల్లో ఇదొకటి. షోడశ(16)అధ్యాయాలున్నాయి గరుడ పురాణంలో.

ఏ పాపం చేస్తే ఎలాంటి శిక్ష అనుభవించాల్సి వస్తుందో సవివరంగా ఈ పురాణంలో ఉంది. ఇదంతా మనిషిలో నైతిక ప్రవర్తనను పెంపొందింపచేసే ప్రయత్నం. నేటి ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థల్లో అరాచకాలను నిరోధించేందుకు పోలీసులు, న్యాయవ్యవస్థ లాంటివి ఉన్నాయి. అయినా అరాచకాలు ఏ స్థాయిలో ఉన్నాయో అందరికీ తెలిసిందే. కొన్ని వేల సంవత్సరాల క్రిందట-మనిషిలో మౌలికంగా నైతికాంశాన్ని పెంపొందింప చేసేందుకు-పురాణాది గ్రంథాలు ఉపకరించాయి.

తప్పుపని చేస్తే పాపం చుట్టు కుంటుంది. ఆ పాపానికి ప్రాయశ్చిత్తంగా రౌరవాది నరకాలు అనుభవించాల్సి వస్తుంది-అనే భయంతోనైనా మనిషి దుష్కర్మ మార్గాన్ని విడిచిపెట్టడం జరుగుతుంది. పిల్లవాడు తనంతట తానే బుద్ధిగా చదువుకోక పోవచ్చు. తల్లికొడుతుందన్న భయంతో, గురువు దండిస్తాడన్న భయంతో బాగా చదువుతాడు. సగటు మానవ మనస్తత్వమూ అంతే! అందుకే పాపం-పుణ్యం అనే చింతనను అందించారు.

అయితే... ఈ జన్మలో పాపం చేస్తే... తర్వాతెప్పుడో కదా శిక్ష అనుభవించేది? ఈలోగా జీవితాన్ని అనుభవిద్దాం... తర్వాత సంగతి ఏమయితేనేం? అని కూడా అనిపించడం సహజం. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయం ఒకటుంది. మనచుట్టూ ఉన్న అనేక జంతువుల కన్న మానవ జన్మ ఎంత ఉత్కృష్టమైందో తెలిసిందే! అలాంటి జన్మను సాధించిన తరువాత దానిని సార్థకం చేసుకోకపోతే ఎలా?

ఈ జన్మను సార్థకం చేసుకోలేదంటే అర్థం- బాగా చదివి ఉద్యోగం పొందాక లంచం తీసుకొని ఉన్న ఉద్యోగాన్ని పోగొట్టుకోవడం లాంటిది! 'పరోపకారార్థం ఇదం శరీరమ్' అన్నది ఒకనాటి మాట. సొంతలాభం కొంత మానుకొని పొరుగువాడికి పాటు పడాలన్నది నేటి మాట! నాడైనా... నేడైనా... ఏనాడైనా... తోటి వారికి కష్టం కలిగించకుండా సంఘానికి మన వల్ల హాని కలగకుండా సాగడమే ఉత్తమ జీవన లక్షణం. అలాకాకుండా దుష్కర్మలకు పాల్పడితే-ఆ దుష్కృతికి నిష్కృతి లేదని చెబుతోంది ప్రాచీన పురాణ విజ్ఞానం! ❖

# యువవాణి

**- స్వామి పరిజ్ఞేయానంద**

**పి. వీరబాబు, కాకినాడ.**

**ప్రశ్న: స్వామి వివేకానందుని మహోన్నత వ్యక్తిత్వాన్నీ, ఆయనకుగల అసాధారణ మేధాశక్తినీ పొందాలంటే ఆధునిక యువత ఏం చేయాలో సూచించండి.**

**జవాబు:** 'నా జీవితమే నా సందేశం'-My life is my message అన్నారు స్వామి వివేకానంద. అంటే స్వామీజీ పలికిన ప్రతీ మాటా ఆయన జీవితంలో ఆచరించి అనుభవపూర్వకంగా చెప్పినదే. ఆచరించి చెప్పిన ఏ మాటైనా ఇతరుల వ్యక్తిత్వంపై అత్యంత ప్రభావాన్ని చూపుతుంది. అందుకే టన్నుల కొద్దీ మాటలు వల్లె వేయడం కన్నా ఒక ఔన్సు ఆచరణ ఉత్తమం అన్నది ఆయన సందేశం.

కాబట్టి స్వామీజీ ఇచ్చిన సందేశాన్ని మన జీవితంలో ఆచరించ గలిగితే ఆయన మహోన్నత వ్యక్తిత్వం మనపై అనూహ్య ప్రభావాన్ని చూపిస్తుంది అనడంలో సందేహం లేదు.



నిజానికి మనందరిలో ఉన్న శక్తి ఒక్కటే- అదే ఆత్మశక్తి. మనం అమృత పుత్రులం, ఆత్మ స్వరూపులం, అనంత శక్తికి వారసులం. మనలో అంతర్గతంగా ఉన్న ఆత్మశక్తిని గ్రహించలేకపోవడం వల్ల గొర్రెల మందలో ఉన్న సింహపు పిల్లలా ప్రవర్తిస్తున్నాం.

స్వామి వివేకానంద సింహగర్జనతో గొర్రెలమనే భ్రాంతి పోయి సింహాలమనే నిజస్వరూపం తెలుసుకొన్ననాడు మనమూ స్వామీజీ అంతటివారం కావచ్చు.

అనంత శక్తీ, అఖండ జ్ఞానమూ మీలోనే ఉంది. ఆ శక్తిని బయటకు తీయగలిగితే మీరూ నా అంతటి వారు కాగలరని స్వామి వివేకానంద స్వయంగా అన్నారు.

If you can think that infinite power, infinite knowledge lie within you, and if you can bring out that power, you also can become like me *- Swami Vivekananda*

అయితే మనలో ఉన్న ఈ అనంత శక్తిని వ్యక్తం చేయాలంటే మూడు లక్షణాల్ని అలవరచుకోవాలి అని స్వామీజీ సూచించారు. అవి: పవిత్రత, సహనం, పట్టుదల.

ఈ మూడు లక్షణాలూ సంపూర్ణంగాగల మహోన్నత వ్యక్తిత్వం స్వామీజీది. ఆయన ఆదర్శాల బాటలో పయనించ గలిగితే మన వ్యక్తిత్వం కూడా మహోన్నతమవుతుంది.

స్వామీజీ మేధాశక్తిలో గల రహస్యం అఖండ బ్రహ్మచర్య పాలన. బ్రహ్మచర్య పాలన ద్వారా అతి తక్కువ సమయంలో అనంతమైన విజ్ఞానాన్ని పొందవచ్చు. అసాధారణమైన జ్ఞాపకశక్తికి ఆలవాలం పవిత్ర మనస్సు.

Simply by the observance of strict Brahmacharya all learning can be mastered in a very short time - one has an unfailing memory of what one hears or knows but once. *- Swami Vivekananda*

'బ్రహ్మచర్య ప్రతిష్ఠాయాం వీర్యలాభః' (పతంజలి యోగ సూత్రాలు) బ్రహ్మచర్య వ్రతాన్ని అవలంబించిన వారి మనస్సు, బుద్ధి, ఇంద్రియాలకు అలౌకిక శక్తి లభిస్తుంది. ఆ శక్తితో అసాధారణమైన కార్యాల్ని కూడా సాధించవచ్చు.

బ్రహ్మచర్యం పాటించకపోవడం వల్లనే మన దేశం వినాశపుటంచులకు చేరుకుంది.

It is owing to this want of continence that everything is on the brink of ruin in our country.

*- Swami Vivekananda*

యంత్రాల యుగంలో మానవ మస్తిష్కపు ఉపయోగాన్ని మరచిన నేటితరం మేధాశక్తిని పెంపొందించుకోవడానికి బ్రహ్మచర్యం అనుసరణీయమని గ్రహించాలి. ఆధునిక యువత ఆత్మశక్తిని అవగతం చేసుకోవడానికి ముందు బ్రహ్మచర్యం అభ్యసించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించడం ఎంతైనా అవసరం. ❖

మీ సందేహాల్ని పంపాల్సిన చిరునామా :
**యువవాణి**
**శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం,**
**దోమల్‌గూడ, హైదరాబాద్ - 500 029**

# మంచి మాటలు... ముత్యాల మూటలు...

– స్వామి సేవ్యానంద

ఈ రోజుల్లో మనమంతా కాలంతో పోటీపడుతూ తీరిక లేకుండా కాలం గడుపుతున్నాం. ఈ తీరికలేని (బిజీ) జీవితంలో ముఖ్యమైన విషయాలను ఆలోచించడానికి కూడా సమయం దొరకని మనకు, విరామం లేకుండా మాట్లాడడానికి మాత్రం సమయానికి కొదవ లేదు. మనం జీవితంలో ప్రగతిని సాధించాలంటే చెప్పేదాని కన్నా చేసే దానికి ఎక్కువ విలువనివ్వాలి. "పని! పని! పనే చేయి... వ్యర్థప్రసంగాలకు స్వస్తి చెప్పు. భగవత్ప్రసంగాలు చేయి. జీవితం ఎంత చిన్నదంటే మిథ్యా ప్రసంగాలకూ, మోసాలకూ వ్యవధి లేదు" అని స్వామి వివేకానంద చెప్పారు. నిత్య జీవితంలో 'మాటలు' ప్రధానమైన పాత్ర వహిస్తాయి. కాబట్టి, వీటిని సరైన రీతిలో వినియోగించుకుంటే మనకూ, మన సమాజానికీ ప్రయోజనం జరుగుతుంది.

**మాటల మహిమ:** మంచికో, చెడుకో మనం ఎక్కువగా మాట్లాడే దేశీయులుగా (Talkative Indians) ప్రఖ్యాతి చెందాం. నేడు మన దేశంలో మొబైల్ ఫోన్ల ప్రాచుర్యం పొందడంతో ఈ మాట్లాడే అలవాటు మనలో మరింత పెరిగి, ఒక సమస్యగా మారింది. అర్థం లేని మాటలతో మన శరీరాన్నీ, మనస్సునూ అనారోగ్యానికి గురిచేయకుండా, మన మాటలు ఇతరులపై, ఈ సమాజంపై ఎలాంటి ప్రభావాన్ని చూపగలవో ఆలోచించాలి. మన మాటలు ఇతరులను ఆహ్లాదపరిచేవిగా, ప్రోత్సాహపరిచేవిగా ఉండాలి. అంతేకానీ అవహేళన చేసేవిగా, కించపరిచేవిగా ఉండకూడదు. మన మాటల ప్రభావంతో బలహీనులలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, ఉన్నతమైన స్థితికి తీసుకురావచ్చు. ఈ మాటలతోనే శారీరకంగా, మానసికంగా శక్తిమంతులైన యువతరాన్ని ప్రభావితుల్ని చేసి, నీచమైన స్థితికి దిగజార్చవచ్చు.

“నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది' అన్నారు మన పెద్దలు. ఎప్పుడూ ఇతరుల దోషాలను ఎత్తిచూపే స్వభావాన్ని వదలి పెట్టి, నలుగురితో సరిగ్గా మాట్లాడుతూ, చక్కగా వ్యవహరిస్తే మనం అన్నిచోట్లా సులభంగా సర్దుకుపోగలం. లేదంటే చీకాకులు, గొడవలు, అశాంతి తప్పవు.

**మనస్సు, మాట ఏకం కావాలి!:** 'మనస్సు, మాట ఒక్కటి అవ్వాలి' అని శ్రీరామకృష్ణులు చెబుతారు. ఆధ్యాత్మిక జీవితంలోనే కాకుండా సాంఘిక జీవితంలో కూడా మనం పురోభివృద్ధి చెందాలంటే మనస్సునూ, మాటలనూ ఒక్కటి చేయడం ఎంతైనా అవసరం. మహాపురుషుల జీవితాల్లో ఈ విషయాన్ని స్పష్టంగా చూడవచ్చు. జీవితంలో ఆచరించి, స్వీయ అనుభవంతో తెలుసుకున్న విషయాలనే వారు నలుగురికీ చెబుతారు. అందుకే, వారి మాటలకి అంత గొప్ప శక్తి ఉంటుంది. ప్రాచీన కాలం నాటి ఉపనిషత్తుల వాక్కులు మొదలుకొని నేటి యుగంలో వివేకానందుని వాక్కుల వరకు ఉన్న ఈ అనంతమైన శక్తికి ఇదే కారణం. మన మనస్సులో ఉన్నదొకటి, చెప్పేదొకటి, చేసేది మరొకటి కాకూడదు. మనలో చాలామంది అధికారం వచ్చే ముందు ఎన్నో వాగ్దానాలు చేస్తారు. అయితే, అధికారం లభించాక స్వార్థానికి బానిసలై, అన్నీ మరచి, అంధులవుతారు. అందుకే నేటి సమాజంలో ఒకరిపై మరొకరికి విశ్వాసం తగ్గి, మనిషికీ మనిషికీ మధ్య, దేశానికీ దేశానికీ మధ్య దూరాలు పెరుగుతున్నాయి.

**మాటలు, మనసుకి ప్రతిబింబాలు:** మాటలను బట్టి ఒక మనిషి మనస్సును అంచనా వేయవచ్చు. మన మనస్సు పవిత్రంగా, ఉన్నతంగా ఉన్నప్పుడే మనం ఉన్నతమైన విషయాలను చర్చించడంలో ఆసక్తిని చూపగలం. లేదంటే అల్పమైన విషయాలను చర్చించడంలోనే ఆనందిస్తాం.

Great minds discuss IDEAS.
Mediocre minds discuss EVENTS.
Small minds discuss PEOPLE.

“ఉన్నతులు ఉత్తమ భావాలనూ, మధ్యములు వివిధ సంఘటనలనూ చర్చించగా, అధములు ఎప్పుడూ ఇతరుల గురించే చర్చిస్తారు”. మనం ప్రస్తుతం ఏ స్థితిలో ఉన్నామో పరిశీలన చేసుకొని, వీలైనంత వరకు ఉన్నతమైన స్థితికి వెళ్ళే ప్రయత్నం చేద్దాం. ❖

మనసు-మర్మం - స్వామి బుధానంద

# మనోనియంత్రణకు భగవత్ చింతన!

మనస్సు కొన్నిసార్లు తనను తానే మాయ చేసుకుంటుంది. చైతన్యరహిత స్థితిలోని మనస్సు చైతన్య స్థితిని మాయ పుచ్చుతుంది. ఎప్పుడో ఒక పరిస్థితిలో మనం ఒక ఆకర్షణ వల్లనో, బలహీనత వల్లనో బాధపడుతూ, దాన్ని వదిలించుకోవడానికి ప్రయత్నిస్తున్నాం అనుకోండి; అకస్మాత్తుగా అప్పుడే మరింత కష్టమైన పరిస్థితి మన కళ్ళ ఎదుట సాక్షాత్కరిస్తుంది. దాన్ని చూసి మనం భయపడి, 'అలాంటి కష్టం ఎదురైతే నేనేం చెయ్యాలి?' అనుకుంటాం. ఆ విధంగా భవిష్యత్తును గురించి ఆలోచించడం ప్రారంభించి, మన ప్రస్తుత పరిస్థితిని మర్చిపోతాం. ఈ అజాగ్రత్త వల్ల ఎదురుగా ఉన్న ఆకర్షణలో కొట్టుకుపోతాం.

ఈ విధమైన వెన్నుపోట్లను తట్టుకొనేదెలా? కాలం పట్ల సరైన అవగాహనను కల్పించుకోవడం ద్వారా మనం ఆ పని చెయ్యవచ్చు. జర్మనీ దేశస్థుడైన 'మీస్టర్ ఎఖార్ట్' అనే యోగి ఇలా చెప్పాడు:

'ఒక్క క్షణంలో అనంతకాలం దాగి ఉంది'. మనం ఈ క్షణం పట్ల జాగ్రత్తపడితే భవిష్యత్తు అంతటి గురించి జాగ్రత్తపడ్డట్లే!

కాబట్టి, మనం ఎలాంటి పరిస్థితిలో ఉన్నా సరే, ఈ ఒక్క క్షణం పట్టుదలతో, స్థిరంగా మన నిర్ణయాలకు కట్టుబడితే చాలు. మనం నెగ్గుతాం. భవిష్యత్తు కోసం ఆందోళన చెందుతూ, వర్తమానాన్ని వృథా చెయ్యడం తెలివితక్కువతనం.

మనస్సును స్వాధీనం చేసుకోవడానికి సంబంధించినంత వరకూ - భగవంతుణ్ణి నమ్మేవారికి, ఆ నమ్మకం లేనివారి కన్నా కొంత పై చేయి ఉంటుంది. భగవంతుని మీద ఎప్పుడైతే విశ్వాసాన్ని పెంపొందించుకుంటామో అప్పుడు మనస్సు స్వాధీనానికి కావలసిన శక్తి మనకు లభిస్తుంది.

"పెద్దపులి ఇతర జంతువులను తినివేసినట్లు, 'దేవుని కోసం పట్టుదల అనే పెద్దపులి' కామక్రోధాలను తినివేస్తుంది" అని శ్రీరామకృష్ణులు చెప్పారు.

ఒకసారి ఈ విధమైన పట్టుదల పెరిగిన తరువాత, కామం, క్రోధం మొదలైన మనోవికారాలు మాయమైపోతాయి. ఎప్పుడైతే కామం, క్రోధం మొదలైన మనోవికారాలు పోతాయో అప్పుడు మనస్సు పవిత్రమవుతుంది. పవిత్రమైన మనస్సును స్వాధీనం చేసుకోవడం సులభం. కానీ నమ్మకం లేనివాడు దీని కోసం చాలా కష్టపడాలి.

భగవంతుని మీద నమ్మకం ఉన్నవాడికి మనస్సులో పవిత్రత ఎలా కలుగుతుందన్న విషయాన్ని వివరించడం సులభం. ఎప్పుడైతే అతడు భగవంతుని పట్ల ప్రేమను పెంచుకుంటాడో అప్పుడు అతని మనస్సు భగవంతుని గురించే ఆలోచించడం ప్రారంభిస్తుంది. ఎందుకంటే మనం దేన్ని ప్రేమిస్తామో సహజంగానే దాని మీదే మనస్సును ఏకాగ్రం చేస్తాం. మన మనస్సు దేని మీద ఏకాగ్రమవుతుందో, దాని లక్షణాలనే పుణికిపుచ్చుకుంటాం. కాబట్టి భగవంతుడి మీద మన మనసుల్ని ఏకాగ్రం చేసినప్పుడు భగవంతుని లక్షణాలను జీర్ణించుకుంటాం. భగవద్గీత వాటినే 'దైవీసంపద' (దైవలక్షణాలు) అని పేర్కొంది. నిజమైన భగవద్భక్తుడు హృదయంలో పవిత్రత, ఇంద్రియనిగ్రహం, క్రోధం, చపలత్వాలు లేకపోవడం, ప్రశాంతత, సహనం మొదలైన దైవీ లక్షణాలను ఎలాంటి శ్రమ పడకుండానే పొందుతాడు. మరొకమాటలో చెప్పాలంటే అతడి మనస్సు దానంతట అదే స్వాధీనంలోకి వస్తుంది. ❖

(1884-1967)

# ముందుకు సాగిపో!

– స్వామి ప్రేమేశానంద

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884–1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ –వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావంతో ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో జూన్,09 సంచిక నుంచి ధారావాహికగా ప్రచురిస్తున్నాం.

కాశీ

6-4-1943

ప్రియమైన సరోజ్ !*

సైకిలు చక్రం తిరుగుతుంది. కానీ అది దానంతట అదే తిరగలేదు. ఎవరైనా త్రిప్పితేనే అది తిరుగుతుంది. దానికి ఒక గమ్యం అంటూ ఏమీలేదు. అది చైతన్యరహితమైనది. భారతీయుల స్థితికూడా ఇలాంటిదే, వారిని ఆడించేవారు ఎలా ఆడిస్తే అలా ఆడతారు. వారికి తమదైన ప్రణాళిక అంటూ ఏమీ ఉండదు. నీ స్నేహితులలో కొందరితో మాట్లాడి చూడు. వారికంటూ జీవితంలో నిజమైన లక్ష్యం ఏదైనా ఉందేమో గమనించు, ఒక పండితునిగానో, ఒక సంపన్నునిగానో ఒక గాయకునిగానో లేక అధ్యాపకునిగానో అవ్వాలనే ఆలోచనే ఉండదు.

సంవత్సరాల తరబడి ప్రపంచంలోని అన్ని దేశాల ప్రజలూ తమ అస్థిత్వానికి ఏమాత్రం భంగం కలగకుండా ఏ లక్ష్యమూ లేని "పశుప్రాయులైన ఈ భారతీయుల భుజాలపై కెక్కి స్వారీ చేస్తున్నారు". నీకు అర్థమవుతోందా? ఇది మనవాళ్ళు విన్నారు. అర్థం చేసుకొన్నారు. కానీ వారు తమ పశు స్థితి నుండి బయట పడటానికి ఏ మాత్రం ప్రయత్నించరు. నువ్వు జాగరూకుడవై ఉంటావా? మేలుకొని ఉంటావా? నీ శక్తినంతటినీ నీ పురోభివృద్ధికే వెచ్చిస్తావా? ఇతరుల బరువులను మోసే గాడిదలా కాక స్వేచ్ఛగా ఉండి నీ పైన నీవే ఆధారపడతావా? అలా అయితే నీ జీవితానికి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకో. పూజ చేసేటప్పుడు ఏం చేస్తావు? వీరాసనంలో (వీరునివలె) కూర్చుంటావు. సంకల్పం (దృఢ నిశ్చయాన్ని) చెబుతావు. శ్లోకాలు పఠిస్తూ నీ దృఢ సంకల్పాలను పదేపదే వల్లిస్తావు. అంతేనా? "అదే విధంగా నీ "జీవితార్చన" గురించి కూడా ఒక లక్ష్యంతో కూడిన నిశ్చయం ఉండాలి.

మొట్టమొదట నీ శ్రేయస్సుకై ప్రయత్నం చెయ్యి. తర్వాత ప్రపంచ శ్రేయస్సుకై కృషిచెయ్యి. ఏమీ గడించలేనివాడు ప్రపంచానికి ఏమి ఇవ్వగలడు? అవునా? కాదా? నీ ఉద్దేశం ఏమిటి? గొర్రెల మందలాగ, నీటి ప్రవాహంలో వాలు వెంట కొట్టుకు పోయే గడ్డిపోచల్లాగ ఎంత మంది పుట్టి గిట్టటంలేదు! తెలివితేటలు అన్నది ఒక్కటి మినహాయిస్తే మానవజీవితం జంతువు అస్థిత్వం కన్నా హీనమైనదే సుమా!

నీ జీవిత లక్ష్యాన్ని గూర్చి పూర్తి జాగ్రదావస్థలో ఉండు. ఎంతో ఉన్నతమైనదైన ఈ మానవజన్మను వృథా చేయకు. ప్రపంచం యావత్తూ దాని దారిన దాన్ని పోనీగాక! నీవు మాత్రం నీ అభ్యున్నతిని జ్ఞప్తిలో ఉంచుకొని ముందుకు సాగిపో!

ప్రేమాశీస్సులతో...
స్వామి ప్రేమేశానంద

(*కాలాంతరంలో రామకృష్ణ సంఘంలో 'స్వామి అనామయానంద'గా ప్రసిద్ధులు)

**తెలుగుసేత : కె. త్రివిక్రమరావు**

# రామకృష్ణ మిషన్ ఆశ్రమ

ఛాప్రా, బీహార్ – 841 301

ఫోన్ నెం : 06152-220739, 244626

Email : rkmchapra@rediffmail.com

**"భగవంతుడి పట్ల గల భక్తి మానవుల పట్ల ప్రేమగా పరివర్తన చెందాలి. దేవాలయంలో దైవాన్ని పూజించండి. ఆ పూజల ద్వారా పొందిన అనుభూతిని మీ నిత్య జీవితంలో కూడా అనుభవించేలా ప్రయత్నించండి. దేవాలయంలోని దైవ ఆరాధన, సమాజంలోని ప్రజల సేవ వేరు వేరు కాదు. ఉన్నతమైన ఈ సందేశాన్ని దైనందిన జీవితంలో అమలు పరచాలి. ఇదే నేడు మనమంతా అర్థం చేసుకొని ఆచరించాల్సిన సందేశం". *- స్వామి రంగనాథానంద***

## విన్నపం

బీహార్‌లో గల ఛాప్రాలోని రామకృష్ణ మిషన్ ఆశ్రమం 2003లో శ్రీరామనవమి నాడు ప్రారంభించబడింది. శ్రీరాముడి కాలం నుండీ ఈ ప్రాంతం ప్రసిద్ధికెక్కింది. స్వామి అద్భుతానందజీ (లాటూమహరాజ్) ఇక్కడ జన్మించడం వలన ఛాప్రా కేంద్రం చారిత్రకంగా ప్రాముఖ్యతని పొందింది. శ్రీరామకృష్ణుల సన్న్యాస శిష్యులలో లాటూ మహరాజ్ మాత్రమే బీహార్‌లో జన్మించారు. అక్షర జ్ఞానం అస్సలు లేక పోయినా అనాథగా సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న లాటూ మహరాజ్ భగవత్కృప వలన కలకత్తా చేరి శ్రీరామకృష్ణుల సన్న్యాస శిష్యుడు అయిన వైనం మీ అందరికీ తెలిసిన విషయమే!

ఛాప్రాలో స్వామి అద్భుతానందజీ స్మారక కేంద్రం ఉండాలనే భక్తుల కోరిక మేరకు రామకృష్ణ సంఘం 13వ సర్వాధ్యక్షులైన పూజ్య స్వామి రంగనాథానందజీ మహరాజ్ అనుగ్రహంతో ఈ మఠ శాఖ ప్రారంభించబడింది. ఈ కేంద్ర అభివృద్ధి కోసం ప్రప్రథమంగా పూజ్య స్వామి రంగనాథానందజీ మహరాజ్ ఆర్థిక సహాయాన్ని అందించారు. అప్పటి నుంచీ ఆధ్యాత్మిక, విద్యా, వైద్య రంగాలలో సేవలు అందిస్తోంది.

ఈ సేవలను సమర్థవంతంగా నిర్వహించడానికి కొన్ని మౌలిక సదుపాయాలు అత్యవసరం.

1. భక్తుల సౌకర్యార్థం ఆశ్రమ భవనం మొదటి అంతస్తు మరమ్మత్తులు చేసి, అందులోనికి శ్రీరామకృష్ణుల ప్రార్థనా మందిరాన్ని మార్చాలి. ఈ మరమ్మత్తులకు అయ్యే ఖర్చు రూ.5 లక్షలు.

2. ధార్మిక వైద్యశాల భవనం మొదటి అంతస్తు నిర్మాణానికి రూ.20 లక్షలు వ్యయం అవుతుంది.

3. సాధు నివాసం, భోజనశాల, కార్యాలయ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు ఖర్చు అవుతుంది.

ఆశ్రమంలో సేవలు నిర్విఘ్నంగా కొనసాగేందుకు అత్యవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చాలి. అందుకు ఉదార హృదయులైన భక్తులు, మిత్రులు, శ్రేయోభిలాషుల నుంచి విరాళాల్ని కోరుతున్నాం.

విరాళాలను Ramakrishna Mission Ashrama, Chapra పేరున చెక్కు/ డి.డి. తీసుకొని, "Ramakrishna Mission Ashrama, Chapra, Dist. Saran, Bihar. Pin - 841301"కు పంపాల్సిందిగా మనవి. అన్ని విరాళాలనూ కృతజ్ఞతతో స్వీకరిస్తాము. విరాళాలన్నిటికీ ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80(జి) కింద పన్ను మినహాయింపు ఉంది.

సదా మీ సేవలో

**స్వామి అసీమాత్మానంద (సుదర్శన్ మహరాజ్)** కార్యదర్శి

(రామకృష్ణ సంఘం 13వ సర్వాధ్యక్షులైన

పూజ్య స్వామి రంగనాథానందజీ మహరాజ్ సేవకుడు)

Advt.

# బోధకులకు ఉద్బోధ!

- ఆర్. కృష్ణ

అబ్రహామ్ లింకన్ తన కుమారుడి ఉపాధ్యాయునికి వ్రాసిన లేఖ నేటి తల్లితండ్రులకూ, ఉపాధ్యాయులకూ, విద్యావంతులకూ ఎంతో స్ఫూర్తిదాయకం. ఆయన వ్రాసిన ఆ లేఖలో అనేక విషయాలను ప్రస్తావించారు. అందులోని అంశాలు స్థూలంగా ఇవి :

1. అందరూ న్యాయశీలురు కారనీ, అందరూ సత్యవంతులు కారనీ వాడు నేర్చుకోవాలి. దుర్మార్గుడు ఉంటాడు; వీరుడు ఉంటాడు, స్వార్థ రాజకీయవేత్త ఉంటాడు, అంకిత భావంగల నాయకుడూ ఉంటాడని నేర్పండి.
2. సంపాదించిన ఒక డాలర్, దొరికిన అయిదు డాలర్ల కన్నా విలువైనదని మీరు వాడికి నేర్పండి.
3. అసూయ నుంచి వాడిని దూరం చేయండి. ప్రశాంతమైన నవ్వులోని రహస్యం నేర్పండి.
4. పుస్తకాల్లో అద్భుతాలుంటాయని వాడికి బోధించండి. అంతేకాదు, ఆకాశంలో ఎగిరేపక్షులు, సూర్యకాంతిలో తిరుగాడే తేనెటీగలూ, పచ్చని కొండపైన పూచే పూవుల అంతుచిక్కని మర్మాల గురించి ఆలోచించ డానికి వాడికి ప్రశాంత సమయం ఇవ్వండి.
5. మోసం చేసే కన్నా తప్పుకోవడం గౌరవప్రదమనీ, మర్యాదస్తులతో మర్యాదగా, మోటువాళ్ళతో మోటుగా ఉండాలనీ బోధించండి.
6. ప్రతి ఒక్కరూ వాడి అభిప్రాయాలు తప్పని చెప్పినా, తన అభిప్రాయాలపై తాను విశ్వాసం ఉంచుకోవాలని వాడికి బోధించండి.
7. మందలో ఒకడిగా కొట్టుకుపోకుండా ఒక్కడిగా నిలిచే బలం వాడికి కలిగేలా, అందరు చెప్పిందీ వినేలా బోధించండి. విన్నదాంట్లో నిజాన్నే స్వీకరించాల్సిందిగా బోధించండి.
8. కష్టాల మధ్య కూడా హాయిగా నవ్వడం ఎలాగో నేర్పండి. బుద్ధి బలంతో ధనార్జన చేయవచ్చు కానీ తన హృదయాన్నీ, వ్యక్తిత్వాన్నీ మాత్రం డబ్బు కోసం అమ్ముకోవద్దని బోధించండి.
9. తాను అనుకున్నది ఒప్పు అని నమ్మితే దాని కోసం పోరాడడం నేర్పండి. తనపై తనకెప్పుడూ పూర్తి విశ్వాసం ఉండాలని బోధించండి.
10. వాడిని ప్రేమగా చూడండి, కానీ ముద్దు చేయవద్దు. ఎందుకంటే వేడి కొలిమి మాత్రమే చక్కటి ఉక్కును తయారు చేయగలదు. ❖

**వ్యక్తి ప్రవర్తనలో మార్పును తీసుకురాని విద్య, దయా దాన గుణాల్నీ, ధైర్య సాహసాల్నీ అలవరచలేని విద్య - విద్యగా పరిగణింప బడదు. వ్యక్తికి స్వావలంబనం చేకూర్చేదే నిజమైన విద్య. - స్వామి వివేకానంద**

# శ్రీరామకృష్ణ మఠం

రిజర్వ్ లైన్, న్యూ నాథమ్ రోడ్, మదురై - **625 014**

ఫోన్: 0452-2680224, 2681181, email : rkmath@dataone.in

## విరాళాలకై విన్నపం

ప్రియ మిత్రులకు,

నమస్సులు, హృదయపూర్వక శుభాకాంక్షలు.

**జ**గజ్జనని శ్రీమీనాక్షీదేవి కొలువై ఉన్న మదురై నగరం దక్షిణ భారతదేశంలోని ప్రముఖ యాత్రాస్థలాలలో ఒకటి. మదురైలోని శ్రీరామకృష్ణ మఠశాఖ 1987లో ప్రారంభించబడింది. 1998లో ఈ మఠం ఆవరణలో శ్రీరామకృష్ణులవారి దేవాలయ సంప్రోక్షణ జరిగింది. అప్పటి నుంచి మదురైలోని శ్రీ రామకృష్ణ మఠం అనేక ధార్మిక,సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

**అన్నదాన భవన నిర్మాణం :** దేశ విదేశాల నుంచి ఏడాది పొడుగునా అనేక మంది భక్తులు శ్రీమీనాక్షీ అమ్మవారి దర్శనం కోసం మదురై వస్తుంటారు. వాళ్ళంతా మదురై వచ్చి ఇక్కడి నుంచి రామేశ్వరం, కన్యాకుమారి, ఇంకా ఇతర యాత్రా స్థలాలకి వెళతారు.

ఈ భక్తులు తమ యాత్రలలో మదురై శ్రీరామకృష్ణ మఠాన్ని సందర్శిస్తారు. ఇలా వచ్చే భక్తుల సంఖ్య ఏటా పెరుగుతోంది. భక్తుల భోజన వసతి కోసం ఒక ప్రత్యేకమైన భోజనశాల నిర్మించడం అవసరమైంది.

అన్నదాన భవన (1847 చ॥అ॥) నిర్మాణానికి అయ్యే ఖర్చు రూ. 12 లక్షలు అని అంచనా.

భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న అన్నదాన భవనానికి ఉదార హృదయులైన భక్తులు, మిత్రులు, శ్రేయోభిలాషుల నుంచి విరాళాల్ని కోరుతున్నాం.

విరాళాలను Sri Ramakrishna Math, Madurai పేరున చెక్కు/ డి.డి. తీసుకొని, "Sri Ramakrishna Math, Reserve Line, New Natham Road, Madurai - 625014" కు పంపాల్సిందిగా మనవి. అన్ని విరాళాలనూ కృతజ్ఞతతో స్వీకరిస్తాము. ఒక లక్ష అంతకు మించి విరాళాలిచ్చే దాతల పేర్లను ప్రత్యేకంగా ప్రదర్శిస్తాము. విరాళాలన్నిటికీ ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80(జి) కింద పన్ను మినహాయింపు ఉంది.

మీ కోసం, మీ కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం మదురైలోని జగజ్జనని శ్రీశ్రీ మీనాక్షి, శ్రీశ్రీ సుందరేశ్వర శివుణ్ణి, భగవాన్ శ్రీరామకృష్ణులు, దివ్యజనని శ్రీ శారదాదేవి, స్వామి వివేకానందులను ప్రార్థిస్తూ,

ధన్యవాదములతో

భగవత్సేవలో
**స్వామి కమలాత్మానంద**
అధ్యక్షులు.

Advt.



# ఈనాటి తపస్సు

– స్వామి రఘునాయకానంద

తపస్సు అనగానే అడవులలోనూ, కొండ గుహలలోనూ, హిమాలయాలలోనూ సాధనలు చేసే యోగిపుంగవులే గుర్తుకు రావడం పరిపాటి. తండ్రి ప్రేమనూ, రాజ్యాన్నీ పొందడానికి ధ్రువుడు తపస్సు చేశాడు. శివుణ్ణి పొందడానికి పార్వతీ, పాశుపతాస్త్రం కోసం అర్జునుడూ తపం ఆచరించారు.

ఏదైనా ఒక వస్తువును పొందడానికి, లేదా లక్ష్యాన్ని సాధించడానికి చేసే తీవ్ర కృషినే తపస్సుగా చెప్పవచ్చు. “ఛాత్రాణాం అధ్యయనం తపః” – విద్యార్థికి చదువుకోవడమే తపస్సు. ఒక వ్యాపారి తన వ్యాపారాన్ని విస్తరించడానికి అకుంఠిత దీక్ష కలిగి ఉండడాన్నే తపస్సుగా చెప్పవచ్చు.

ఇక ఆధ్యాత్మికతకు వచ్చేసరికి, “నా తపస్వినో యోగః సిద్ధ్యన్తి” – తపస్వి కాని వాడికి యోగం సిద్ధించదు. మనఃశరీరాలను వశం చేసుకొని, వాటిని యథేచ్ఛగా సంచరించనీయకుండా ఉచితరీతిని నిరోధించడమే తపస్సుగా స్వామి వివేకానంద నిర్వచించారు. తైత్తిరీయ ఉపనిషత్తు శంకర భాష్యంలో “మనసశ్చ ఇంద్రియాణాం చ హైకాగ్ర్యం పరమం తపః” – మనస్సునూ, ఇంద్రియాలనూ వశంలోకి తీసుకురావడమే తపస్సు అన్నారు. అసలు ‘తపః’ అంటే కొలిమిలో పెట్టి కాల్చడం; భూమిని త్రవ్వి తీసిన ముడి లోహాలను కాల్చి, పరిశుద్ధమైన లోహాలుగా మార్చడం. అదే విధంగా ఆధ్యాత్మిక సాధకుడు తపస్సు ద్వారా మనస్సులో ఉన్న మలినాలను తొలగించి పరిశుద్ధం చేయడానికి ఈ తపస్సు ఉపయోగపడుతుంది.

‘ఎవరు విజ్ఞానవంతుడో– వశీకృతమైన మనస్సు కలవాడో, సదా పరిశుద్ధుడో అతడు పునర్జన్మ రహితమైన ఆ పరమపదాన్ని చేరుకొంటాడు’ అని కఠోపనిషత్తు చెబుతోంది.

భగవద్గీత 17వ అధ్యాయంలో శారీరక, వాచిక, మానసిక తపస్సుల గురించి శ్రీకృష్ణుడు తెలియజేశాడు. దేవతలనూ, గురువులనూ, తత్త్వవేత్తలనూ పూజించడం, శుచిత్వం, సత్ప్రవర్తన, బ్రహ్మచర్యం, అహింసలను శారీరక తపస్సుగా పేర్కొన్నాడు. ఇతరులకు భయాన్నీ, కష్టాన్నీ కలిగించకుండా, వినడానికి కష్టం కలిగించని సత్య వాక్యం, వేదాభ్యాసాలను వాచిక తపస్సుగా తెలిపాడు. చిత్తశుద్ధి, కనికరం, వాక్ నిరోధం, మనఃనిరోధాలను మానసిక తపస్సుగా శ్రీకృష్ణుడు వివరించాడు.

విచక్షణతో, శాంత స్వభావంతో, దయ, ప్రేమలను కలిగి ఉండే మనిషి మంచి పనులు చెయ్యగలుగుతాడు. తద్వారా తనకు తాను మంచి చేసుకోగలుగుతాడని స్వామీజీ చెప్పారు.

హనుమంతుడు శ్రీరామునితో ఏర్పడిన మొదటి పరిచయంలోనే ఆయన మెప్పును పొందాడు. శ్రీరాముడికీ, సుగ్రీవుడికీ మైత్రి కలిపాడు. రామాయణంలో హనుమంతుడి పాత్రను గమనించినట్లయితే ఎవరితో ఏ విధంగా మాట్లాడాలో, ఎక్కడ ఎలా మాట్లాడాలో అలా మాట్లాడడం చూస్తాం. స్వామి వివేకానంద చికాగో సర్వమత మహాసభలలో కేవలం “సోదర సోదరీ మణులారా” అన్న ఒక్క మాటతో మొత్తం ప్రపంచాన్నే జయించారు. స్వామీజీ వాక్చాతుర్యం మానవాళి పట్ల ఆయనకున్న ప్రేమ నుంచి పుట్టుకొచ్చింది. ఆయన మాట్లాడిన దానికి ప్రతిస్పందన కూడా అనూహ్యంగా వచ్చింది. శ్రీశారదాదేవి అవధులు లేని ప్రేమ చెడ్డవారిని సహితం సన్మార్గుల్ని చేసేది.

మాట్లాడడం కూడా ఒక కళే. మాట్లాడడం ఒక్కటే సరిపోదు. ఎవరికీ హాని కలిగించకుండా మాట్లాడాలి. ప్రేమతోనూ, అప్యాయతతోనూ మనం చెప్పదలచుకున్న దాన్ని చెబితే, అది ఇతరులకు నచ్చేలా, సంతోషం కలిగించేలా ఉంటుంది.

కలియుగంలో మనిషి అన్నగత జీవి. అడవులలోనూ, గుహలలోనూ సాధనలు చేయలేరు కనుక కేవలం సత్యాన్ని ఆచరించడమే ఈ కలియుగంలో తపస్సు అని శ్రీరామకృష్ణులు చెప్పారు. అంతేకాకుండా ఆయన స్వయంగా సత్యపాలన చేసి చూపించారు కూడా! ❖

# నవతరానికి నవీన సందేశం

– ఆరుద్ర శ్రీకాంత్

మా ఊరు వరంగల్ జిల్లా, డోర్నకల్ మండలం, ముల్కలపల్లి గ్రామం. నేను ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న సమయంలో ఒక రోజు ఒక పుస్తకం కొన్నాను. ఆ పుస్తకం పేరు 'నా భారతం అమర భారతం'. అందులో స్వామీజీ ఆధ్యాత్మికతతో కూడిన భారతదేశాన్ని దర్శింప జేశారు. భారతదేశమంతా ఆధ్యాత్మికతతో మేళవింపబడాలనీ, ఆధ్యాత్మికతే భారతదేశానికి పునాది అనీ స్వామీజీ ఉద్ఘాటించారు.

భగవంతుడు ఎక్కడో లేడనీ, ఆకలితో అలమటిస్తున్న నిరుపేదల్లో, రోగుల్లో, అజ్ఞానిలో ఉన్నాడనీ వారికి సేవ చేయడమే నిజమైన పూజ అనే నవీన సందేశాన్ని ఇచ్చారు స్వామీజీ. ఆ సందేశాన్ని నేను పరిపూర్ణంగా స్వీకరించాను.

నేటి యువతరంపై స్వామీజీ ఎన్నో కలలు కన్నారు. ఆ కలలు కల్లలై పోతాయేమోనని నేటి యువతరాన్ని చూస్తే నాకు ఎక్కడో మూల ఒకింత బాధ, ఆవేదన ఉండేవి. కానీ రామకృష్ణమఠం వారు స్వామీజీ అమృత, ఆధ్యాత్మిక నవ భారత సందేశాన్ని అందజేస్తున్నారు. అందువల్ల నాకున్న భయం ఇప్పుడిప్పుడే మెల్లమెల్లగా తొలగి పోతోంది. ఎందుకంటే ఎప్పటికైనా యువత స్వామీజీ ఆదర్శాలను స్వీకరించి, సన్మార్గంలో పయనిస్తుందనే విశ్వాసం నాకుంది.

నేను ఇప్పుడు ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ చేస్తూ, ఒక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాను. ఉపన్యాసాల ద్వారా నాతోటి మిత్రులకూ, నా విద్యార్థులకూ స్వామీజీ భావాలను అందిస్తున్నాను. 'భారత జాతికి నా హితవు, చికాగో నగర ఉపన్యాసాలు, వ్యక్తిత్వ వికాసం, వే టు సక్సెస్' మొదలైన పుస్తకాలను నేను అధ్యయనం చేశాను. వాటిలోని అంశాలను వీలైనంత వరకూ అందరికీ అందించాలన్నదే నా తపన. ❖

---

# సమస్యల తీరానికి చేర్చే స్వామీజీ సందేశం !

– జి. నర్సిములు

మాది మహబూబ్‌నగర్ జిల్లా, దామర్‌గిద్ద మండలం, మద్దెలబీడు గ్రామం. నేను ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు చదువుపై ఏకాగ్రత కుదిరేది కాదు. అందువల్ల ఇంటర్‌లో పరీక్ష తప్పాను. ఆ సమయంలో అసలు ఏం చేయాలో తోచలేదు. 2004వ సంవత్సరంలో మా ఊరిలో వివేకానంద గ్రంథాలయాన్నీ, రామకృష్ణ సేవా సమితినీ ఏర్పాటు చేసిన మా శంకర్ రెడ్డి గారికి ధన్యవాదాలు. ఆ గ్రంథాలయానికి వెళ్ళి ఒక పుస్తకం చదివాను.

ఆ పుస్తకంలో ఈ సందేశాలను చదివాను – "మీరు ఎలా ఆలోచిస్తారో అలాగే అవుతారు. అందుకే జీవితంలో సానుకూల ఆలోచన ఉండాలి. కార్యరంగంలోనూ, పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ ఎన్నో సమస్యలు ఎదురవుతాయి. ఆత్మవిశ్వాసం, పట్టుదల, దృఢ సంకల్పం ఉంటే వాటన్నింటినీ అలవోకగా దాటిపోవచ్చు". "మీ గమ్యాన్ని చేరే వరకూ ఆగకండి. సమస్యలు ఉన్నాయని కూర్చుంటే సమస్యలు తీరవు. ఆ సమస్యల వెంబడి పరుగెత్తండి". "విశ్వాసం ఉన్న వ్యక్తి నేను ఈ సముద్రాన్ని త్రాగేయగలను. కొండలను పిండి చేయగలను అని అనుకుంటాడు".

అసలు ఈ పుస్తకం నా కోసమే వ్రాశారా అన్నట్లు అనిపించింది. ఈ సందేశాలే నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపి, విజయపథం వైపు నడిపించేలా చేశాయి. ఈ ఆత్మవిశ్వాసం కల్పించిన మాటలన్నీ స్వామీజీ సందేశాలే! ఆ విశ్వాసమే నేను ఇంటర్ స్థాయి నుంచి పి.జి. స్థాయి వరకూ ఎదగడానికి తోడ్పడింది. నాలో పట్టుదల పెరగడానికి కారణం స్వామి వివేకానందుల వారి సందేశమే! సోదర సోదరీమణులారా! స్వామీజీ చెప్పిన సందేశాలనూ, బోధనలనూ మనందరం ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహిద్దాం ! ❖

# కనువిప్పు కలిగించిన కృష్ణుడు!

శ్రీకృష్ణుడు అర్జునుడికి స్నేహితుడు, రథసారథి, గురువు అని అందరికీ తెలిసిన విషయమే. కురుక్షేత్ర సంగ్రామం ముగిశాక తాను చేసిన పాపాలను తొలగించుకోవడానికి గంగాస్నానం చెయ్యాలనుకున్నాడు అర్జునుడు. శ్రీకృష్ణుడికి ఆ విషయం చెప్పి రథాన్ని గంగ ఒడ్డుకు తీసుకువెళ్ళమన్నాడు.

అర్జునుడి మనస్సులోని సంగతి కృష్ణుడికి అర్థమయింది. కృష్ణుడి విశ్వరూపాన్ని దర్శించినప్పటికీ అర్జునుడు, కృష్ణుడు స్వయం భగవానుడు అన్న విషయం విస్మరించాడు. కృష్ణుడు అర్జునుడు చెప్పినట్లే గంగానదీ తీరంలో రథాన్ని ఆపి, "అర్జునా! ఇక్కడ కొంచెం ఆగు. నేను దగ్గర్లోనే ఉన్న నా స్నేహితులను కలుసుకొని వస్తాను" అని చెప్పి, ఎటో వెళ్ళాడు.

ఇంతలో నలుగురైదుగురు వ్యక్తులు అర్జునుడు నిలబడిన చోటికి ఒక మృతదేహాన్ని మోసుకుంటూ వచ్చారు. వాళ్ళు తమలో తాము ఏదో విషయం గురించి కలహించుకుంటున్నారు. వారి సంభాషణ జాగ్రత్తగా విన్న మీదట అర్జునుడికి వాళ్ళు చితి వెలిగించడానికి నిప్పు తెచ్చుకోవడం మరచిపోయారని అర్థమయింది. కాసేపు వాదనలు అయ్యాక వాళ్ళు శవాన్ని అక్కడే నేల మీద ఉంచి, నిప్పు తేవడానికి వెళ్ళారు.



కాసేపటికే శవం దగ్గరకు ఒక శునకం రావడం గమనించాడు అర్జునుడు. ఆ కుక్క, శవాన్ని వాసన చూడసాగింది. ముందుగా ముఖం, తరువాత చేతులు, ఆఖరున పాదాలు వాసన చూసి వచ్చిన దారినే కుక్క వెనుదిరిగింది. ఇదంతా చూసిన అర్జునుడు ఆశ్చర్యపోయాడు.

ఇంతలో మరొక కుక్క అటుగా వస్తూ, ఆ మొదటి కుక్కతో, "మిత్రమా! ఏమిటి సంగతి? రుచికరమైన ఆహారాన్ని ఆరగించకుండా వెళ్ళిపోతున్నావెందుకు?" అని ప్రశ్నించింది.

అందుకు మొదటి కుక్క, "అయితే విను! పూర్వ జన్మలో చేసుకున్న పాపాల కారణంగా నేను ఇప్పుడు కుక్కగా జన్మించాను. అయినా నేను అపవిత్రమైన ఆహారాన్ని స్వీకరించను. ఈ వ్యక్తి ముఖం, చేతులు, కాళ్ళు వాసన చూసి, ఇతను తన జీవితంలో ఒక్క మంచి పని కూడా చెయ్యలేదని గ్రహించాను. ఇతను ఎన్నడూ భగవన్నామాన్ని ఉచ్చరించలేదు. ఎవరికీ ఒక్క పైసా అయినా దానం చెయ్యలేదు. జీవితంలో ఒక్క మారు కూడా అతని కాళ్ళు దేవాలయం వైపు వెళ్ళలేదు. అందువల్ల నాకు ఇతని దేహం అస్పృశ్యమైనది" అని వివరించింది.

ఇదంతా విన్నాక రెండో కుక్క, "నువ్వు చెప్పినది నిజమే! అజ్ఞానం వల్ల మానవులు ఎలా పొరపాట్లు చేస్తారో చూడు! ఆ పక్కకు చూడు. అర్జునుడు రథంలో కూర్చొని ఉన్నాడు. అతను శ్రీకృష్ణుని సఖుడు, శిష్యుడు అయినా అజ్ఞానం అనే వలలో ఎలా చిక్కుకున్నాడో! అతను తన పాప ప్రక్షాళనానికి గంగానది దగ్గరకు వచ్చాడు. అర్జునుడి గురువు, పరబ్రహ్మ అయిన నారాయణుని పాదపద్మాల నుండే ఈ దేవనది ఉద్భవించిందన్న విషయాన్ని అతను విస్మరించినట్లున్నాడు. భగవంతుడితో సంబంధం కలిగి ఉండడం వల్ల సదరు వ్యక్తి మహా అదృష్టవంతుడు, అతను ఎన్నటికీ పవిత్రుడు. స్వయం శ్రీకృష్ణపరమాత్మతో సంబంధం కలిగి ఉన్నా అర్జునుడు తన పాప నిర్మూలనానికి గంగా స్నానానికి వచ్చాడు. అతడు ఎంతటి అజ్ఞాని!" అన్నది.

అంతా విన్న అర్జునుడు తీవ్రమైన ఉద్వేగానికి గురయ్యాడు. 'శునకాలు చెబుతున్నది నిజమే. ఆ జగన్నాథునితో అనుబంధం ఉన్నా నా మనస్సులో ఏదో శంక మిగిలిపోయింది. సాక్షాత్తూ దేవదేవుణ్ణి పక్కనే పెట్టుకొని, పాపప్రక్షాళన అంటూ ఎక్కడికో వెళుతున్నాను. నేనెంత మూర్ఖుణ్ణి!' అనుకున్నాడు అర్జునుడు.

కొద్దిక్షణాలలో శ్రీకృష్ణుడు తిరిగి వచ్చాడు. అర్జునుడు తన శిరస్సు వంచి, శ్రీకృష్ణుని పాదాల చెంత ప్రణమిల్లాడు. వెంటనే అతని తలను గంగాజలం కడిగింది. కృష్ణుడు తన ప్రియ సఖుడూ, శిష్యుడూ అయిన అర్జునుణ్ణి దగ్గరకు తీసుకున్నాడు. తాను విన్నదీ, చూసినదీ ఆ శ్రీకృష్ణుడి మాయ అని గ్రహించిన అర్జునుడు ఆనందాశ్రువులు రాల్చాడు. ❖

... 17వ పేజీ తరువాయి.

9 గ్వాలియర్ కోటలో గల ఒక దేవాలయంలో ఒక మహాత్ముడు విశేష పూజలు చేస్తే మహారాజు వ్యాధి నయమవుతుందని జోస్యులు చెప్పారు. జహంగీరు కోరిక ప్రకారం హరగోవింద్ సింగ్ అక్కడికి వెళ్ళి ప్రార్థనలు చేశాడు. చక్రవర్తి వెంటనే కోలుకున్నాడు.
10 గ్వాలియర్ కోటలో జహంగీరుకు ఎదురు తిరిగిన 52 మంది సామంత రాజపుత్రులు బందీలుగా ఉన్నారు. వారు ఎన్నో చిత్రహింసలకు గురవుతున్నారు. వారిని ఆదుకోవాలని హరగోవింద్ తీర్మానించాడు.
11 కోటకు అధికారి అయిన హరిదాసు, హరగోవింద్ సింగ్ భక్తుడు. అతడు హరగోవింద్ కోరినట్లు చెరలో ఉంటున్న సామంత రాజులను హింసలు పెట్టకుండా ఆప్యాయంగా చూసుకోవడం ప్రారంభించాడు. కొన్ని రోజుల తర్వాత...
హరిదాస్! చక్రవర్తి పూర్తిగా కోలుకున్న తరువాత కూడా నన్ను ఎందుకు నా రాజ్యానికి వెళ్ళనివ్వడం లేదు? బహుశా నేను కూడా ఇక్కడ ఒక ఖైదీనా ఏమిటి?
12 హరగోవింద్ సింగ్ కోట విడిచి వెళ్ళడానికి జహంగీరు వద్ద అనుమతి పొందాడు వజీర్‌ఖాన్. ఈ విషయాన్ని హరగోవింద్ సింగ్‌తో చెప్పినప్పుడు...
వజీర్! నేను ఇక్కడ నుంచి వెళ్ళాలంటే ఒక నిబంధన! ఇక్కడ చెరసాలలో బందీలుగా ఉన్న సామంత రాజులందరినీ విడిచిపెట్టి, నాతో పాటు పంపాల్సిందిగా చక్రవర్తికి విన్నవించండి!



చివరికి గురు అర్జునదేవ్ మరణానికి కారణం సంతూషా అందించిన తప్పుడు సమాచారమే అని జహంగీరు తెలుసుకున్నాడు. అతనిని తగిన రీతిగా దండించే బాధ్యతను మహారాజు హరసింగ్‌కు అప్పగించాడు. జీవిత పర్యంతం వారిద్దరూ మంచి స్నేహితులుగా కలిసిమెలిసి జీవించారు.

# గ్రంథ పరిచయం

## నారాయణ భట్టు



రచన: నోరి నరసింహశాస్త్రి
పేజీలు: 306, వెల: 135/-
ప్రతులకు: టాగూర్ పబ్లిషింగ్ హౌస్, కాచిగూడా చౌరస్తా, హైదరాబాద్ - 27

"తింటే గారెలు తినాలి. వింటే భారతం వినాలి" అనే సామెత తెలుగు భారతం వల్లనే పుట్టిందని పెద్దల మాట. నన్నయభట్టు భారతాన్ని తెలుగులో వ్రాయడానికి సహాయకుడు సహాధ్యాయి నారాయణ భట్టు. నారాయణ భట్టుకు సంబంధించిన జీవిత విశేషాలు తెలుగు ప్రజలకు అందకుండా మరుగున పడిపోయాయి. ఆయన జీవిత విశేషాలను చారిత్రక ఆధారాల ద్వారా పరిశీలించి, పరిశోధించి, ప్రముఖ రచయిత నోరి నరసింహశాస్త్రి 'నారాయణ భట్టు' నవలను తెలుగు ప్రజలకు అందించారు. 1950 ప్రాంతంలో తెలుగు ప్రజలనెంతో అలరించిన ఈ చారిత్రక నవల పునర్ముద్రణ పొందడం తెలుగు సాహిత్యాభిలాషుల అదృష్టం. ❖

- ఎం.వి. నాగప్రసాద్

## శ్రీ గురు చరిత్ర

రచన : ఓరుగంటి రామకృష్ణ ప్రసాద్
పేజీలు: 328, వెల రూ.90/-
ప్రతులకు: నవరత్న బుక్ హౌస్, 28-22-20, రహిమాన్ వీధి, అరండల్ పేట, విజయవాడ -520 002.

గురువుల గొప్పతనాన్ని లోకానికి వివరించడానికి త్రిమూర్తుల అంశతో దత్తుడు (అత్రి అనసూయల పుత్రుడు దత్తాత్రేయుడు) గురుస్వరూపంగా లోకంలో ప్రసిద్ధిగాంచాడు. దత్ అంటే ఇచ్చేవాడు అని అర్థం; సర్వుల కోరికలు తీర్చే కరుణామయుడు. "శ్రీగురు చరిత్ర" నామధారకునికి సిద్ధయోగీంద్రులు చెప్తున్నట్లుంటుంది. అంటే పరమాత్మ జీవునికి చెబుతున్న కథ ఇది. దీనిని శ్రీ గంగాధర సరస్వతి వ్రాయగా, శ్రీ వాసుదేవానంద సరస్వతి సంస్కృత భాషలో వ్రాశారు. దానిని అందరికీ అర్థమయ్యేలాగ సులభశైలిలో తెనుగించారు రచయిత శ్రీ ఓరుగంటి రామకృష్ణ ప్రసాద్. దత్త క్షేత్రాలలో శ్రావణ మాసంలో దీనిని నిత్యపారాయణ చేస్తారు. ఈ గ్రంథం ప్రతీ ఒక్కరూ నిత్యపారాయణ గానో, సప్తాహపారాయణ గానో చదివి గ్రహ గృహ బాధలన్నీ తొలగించుకోవచ్చు. ❖

-శ్రీమతి ఎన్. శేషు

## ఈశ్వరీయమ్



రచయిత: యముగంటి ప్రభాకర్
పేజీలు: 113, వెల : రూ. 50/-
ప్రతులకు : వై. ప్రభాకర్
టి.ఆర్.టి 284, విద్యానగర్ కాలనీ
హైదరాబాదు - 500 044

## శ్రీ త్యాగరాజు-భాగవతార్థము

గ్రంథకర్త : ఇలపావులూరి కామేశ్వరరావు
పేజీలు: 52, వెల : రూ. 35/-
ప్రతులకు : ఇలపావులూరి పినాకపాణి
ప్లాట్ నెం.4, కామాక్షీ నిలయం,
లక్ష్మీపురం సెంటర్, స్టోన్‌హౌస్‌పేట, నెల్లూరు

## భక్తులకు మంత్రోపదేశం

రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్‌ల ఉపాధ్యక్షులు **పూజ్య స్వామి స్మరణానందజీ మహరాజ్** 2009 సెప్టెంబరు 9 నుంచి సెప్టెంబరు 23వ తేదీ వరకు హైదరాబాద్ రామకృష్ణ మఠంలో బస చేస్తారు. పూజ్య స్వామీజీ ఆసక్తిగల భక్తులకు **సెప్టెంబరు 13,16,18,20వ** తేదీల్లో మంత్రదీక్ష ప్రసాదిస్తారు. మరిన్ని వివరాల కోసం : **స్వామి జ్ఞానదానంద అధ్యక్షులు, రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్ - 500 029**ను సంప్రతించవలెను.

# విద్యార్థులకు వేసవి శిబిరం

**హైదరాబాద్ రామకృష్ణ మఠం** బాలబాలికలకు నెల రోజుల పాటు వేసవి శిబిరాన్ని నిర్వహించింది. 1030 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొని యోగాసనాలు, భజనలు, గీతాపారాయణం మొదలైన అంశాలలో శిక్షణ పొందారు. డాక్టర్ ఎమ్.సి.ఆర్. మానవ వనరుల అభివృద్ధి సంస్థ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీ జె.ఎస్.వి. ప్రసాద్, ఐ.ఏ.ఎస్. గారు 2009 ఏప్రిల్ 26న ప్రారంభించిన ఈ శిబిరం మే 23న ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖపట్నం రేంజ్ డెప్యుటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, డాక్టర్ సౌమ్య మిశ్ర, ఐ.పి.ఎస్. పాల్గొని సంగీతం, వక్తృత్వ, పారాయణ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ❖ నివేదిక : స్వామి శ్రీకాంతానంద

# ఐలా తుపాను బాధితులకు రామకృష్ణమిషన్ సహాయక చర్యలు

2009 మే నెలలో సంభవించిన ఐలా తుపాను కారణంగా పశ్చిమ బెంగాల్‌లోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. తుపానుకు గురైన ప్రాంతాల్లో రామకృష్ణ మిషన్ వేలాది మంది బాధితులకు -ఆహార పొట్లాలనూ, నిత్యావసర సామగ్రినీ, దుస్తులనూ, దుప్పట్లనూ, మందులనూ సరఫరా చేసింది. ఈ సహాయక కార్యక్రమాలు ఇంకా కొనసాగుతున్నాయి. తుపాను బాధితుల సహాయ, సేవా కార్యక్రమాల నిమిత్తం విరాళాలను కోరుతున్నాం. దాతలు

"Ramakrishna Mission" పేరున చెక్కు డి.డి. లేక నగదు రూపంలో విరాళాలను ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

**The General Secretary**
**Ramakrishna Mission**
**P.O. Belur Math, Howrah**
**West Bengal - 711 202**
**Ph: 033 - 2654 5702, 2654 9681**
Email: rkmrelief@gmail.com
Website: www. belurmath.org

విరాళాలకు ఆదాయపు పన్ను చట్టంలోని 80(జి) సెక్షన్ క్రింద పన్ను మినహాయింపు కలదు. ❖

# శ్రీ పరమాచార్య చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ వేదాధ్యయనానుసన్ధాన ప్రతిష్ఠానమ్

## ప్రవేశ / ఉద్యోగ ప్రకటన

**1. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది కోర్సులకు దరఖాస్తులు కోరబడుచున్నవి.**

(అ) 'వేదచూడామణి' : ఋగ్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క అధ్యయనము
యోగ్యతలు : మాతృభాషలో చదువగలిగి, వ్రాయగలిగి ఉండాలి.
వయస్సు : 8 నుంచి 10 సంవత్సరాల మధ్య
స్టైఫండ్ : నెలకు రూ. 1,000/-

(ఆ) 'వేదార్థచూడామణి' : ఋగ్వేదము/ యజుర్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క భాష్యాధ్యయనము
యోగ్యతలు : సంస్కృత పరిజ్ఞానముతో బాటు ఏదో ఒక వేదాన్ని పూర్తిగా అధ్యయనం చేసి ఉండాలి.
వయస్సు : 15 సం॥, ఆ పైన
స్టైఫండ్ : నెలకు రూ. 3,000/-

**2. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది ఉద్యోగాలకు దరఖాస్తులు కోరబడుచున్నవి.**

(అ) వేదాధ్యాపకుడు : (సామవేదము/ అథర్వవేదము - వేదానికి ఒక్కొక్కరు చొప్పున రెండు ఖాళీలు)
కావలిసిన అర్హతలు : క్రమాంతము లేక పదాంతము
అదనపు అర్హతలు : ఏదైన మఱియొక వేదము/ వేదభాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవము : 2 సంవత్సరములు
సంభావన : నెలకు రూ॥ 8,000/- మొత్తము, సౌకర్యములతో

(ఆ) వేదభాష్యాచార్యుడు : (ఒక్కొక్క వేదానికి ఒక్కొక్కరు చొప్పున 4 ఖాళీలు)
విద్యార్హత : ఏదైనా వేద భాష్యంలో ఉత్తీర్ణత
అదనపు అర్హత : మరొక వేద భాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవార్హత : 5 సం॥
సంభావన : నెలకు రూ. 10,000/- మొత్తము, సౌకర్యములతో

ముద్రించిన దరఖాస్తు ఫారములను **శ్రీ పి. వేంకటేశ్వర్లు గారు, మేనేజింగ్ డైరెక్టర్, కాకతీయ సిమెంట్, సుగర్ & ఇండస్ట్రీస్ లిమిటెడ్, 'గురుకృప' (ఆంధ్రా బ్యాంకు ఎదురుగా), 1 - 10 - 140/1, అశోక్‌నగర్, హైదరాబాద్ - 500 020** (ఫోను: 040 - 27637717) నుంచి ప్రత్యక్షముగా గాని, పోస్టు ద్వారా గాని పొందవచ్చు. పూర్తి చేయబడిన ఆ ముద్రిత దరఖాస్తులను ఈ పై అడ్రసుకు పంపవలెను. అవసరాన్ని బట్టి ఖాళీలను పూరించుట లోనూ, అర్హతల సవరణ లోనూ మేనేజ్‌మెంటుకు అధికారము కలదు.

సం/-
కులప్రశాసకుడు

హైదరాబాద్


Sponsored by:

**KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED**

Regd. Office : 1 - 10 - 140/1, Gurukrupa, Ashok Nagar, Hyderabad - 500 020
Ph: 2763 7717, 2763 3627, Fax No. 040-27630172, Email: info @ kakatiyacement.com



Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**